# నేటి నిజం

తెలుగు దినపత్రిక

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026

హైదరాబాద్ శుక్రవారం 20-9-2024 సంపుటి :31 సంచిక:42 పేజీలు:6 వెల: రూ.1/-


## దేశానికే ఆదర్శంగా స్కిల్ యూనివర్సిటీ - సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 19 : దేశానికే ఆదర్శంగా స్కిల్ యూనివర్సిటీష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఆ బాధ్యతను యూనివర్సిటీ బోర్డుకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రం లోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగ స్వామ్యం పంచుకోవాలని, యువతకు నైపుణ్యాలు నేర్పించి ఉపాధి కల్పించేందుకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున యూనివర్సిటీకి 150 ఎకరాల స్థలంతో పాటు రూ.100 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు స్కిల్ యూనివర్సిటీ లో భాగస్వామ్యం పంచుకోవాలని, యూనివర్సిటీ పూర్తి స్థాయి నిర్వహణకు కార్పస్ ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు.

యూనివర్సిటీలో భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ కంపెనీల పేర్లను లేదా దాతల పేర్లను ఈ భవనాలకు పెట్టాలని అధికారులకు సూచించారు. వీలైనంత వేగంగా తమ ఆలోచనలను ఆచరణలోకి తెచ్చామని, ఇకపై యూనివర్సిటీ బాధ్యతను బోర్డు ఛైర్మన్ మహీంద్రా ఆనంద్కు అప్పగిస్తున్నామని అన్నారు.

ఈ రంగంలో అనుభవంతో పాటు ప్రత్యేక గుర్తింపు ఉన్న మహీంద్రా ఆనంద్ స్కిల్ యూనివర్సిటీకి తన బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకం ఉందని అన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటి నుంచి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందని చెప్పారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్లో ఇండియాకు గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామని అన్నారు.

ఈ యూనివర్సిటీ యూనివర్సిటీ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ముఖ్యమంత్రి పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల ఇబ్బంది లేదని.. రూ. 3 లక్షల కోట్ల బడ్జెట్లో వెయ్యి కోట్లు ఖర్చయినా భరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆర్థిక సహకారానికి మించి, రాష్ట్రంలోని అందరు పారిశ్రామికవేత్తలు, వ్యాపార వాణిజ్యవేత్తలు ఆశించినంత చొరవ ప్రదర్శించాలని.. తగిన భాగస్వామ్యం, బాధ్యతలను పంచుకోవాలని కోరుతున్నట్లు చెప్పారు.

తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డుతో పాటు రాష్ట్రం లోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధుల తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో సమావేశమ య్యారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, కో ఛైర్మన్ శ్రీని రాజు, బోర్డు సభ్యులు పి.దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బోర్డు సభ్యులు మనీష్ సభర్వాల్, సంజీవ్ బిక్చందానీ, ఎంఎం మురు గప్పన్, డాక్టర్ కేపీ కృష్ణన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. స్కిల్ యూనివర్సిటీ చేయాలనే తన ఆలోచనలతో పాటు భవిష్యత్తు ఆకాంక్షలను ఆయన యూనివర్సిటీ బోర్డుతో, రాష్ట్రంలోని వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులతో పంచు కున్నారు. డిగ్రీలు, పీజీ పట్టాలు ఉంటే సరిపోదని, ఇంజనీరింగ్ పూర్తి చేసిన లక్షలాది మంది యువకులు ఒక ఉద్యోగం ఇప్పించండని తన వద్దకు వస్తున్నారని ముఖ్యమంత్రి తనకు ఎదురైన కొన్ని అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఏటేటా లక్షలాది మంది యువ కులు డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్నారని.. కానీ అందరూ ఉద్యోగాలు సాధించలేక పోతున్నారని అన్నారు. మరోవైపు పరిశ్రమల అవసరాలకు సరిపడే మానవ వనరుల కొరత ఉందని చెప్పారు. ఈ అంతరాన్ని తొలిగించేందుకు స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పాలనే ఆలోచన చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అందరికీ సరిపడేన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఉండవని, వివిధ రంగాలతో పాటు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు నేర్చుకుంటే యువత ఉపాధికి ఢోకా ఉండదని చెప్పారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి కీలక అంశాలను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు పారిశ్రామికవేత్తలకు వివరించారు.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌పై మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం



హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); :: ఈరోజు సచివాలయంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పర్యవేక్షణ కోసం ఏర్పాటైన మేనేజ్‌మెంట్ కమిటీ మొదటి సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ కొడంగల్, మధిర నియోజకవర్గం, లక్ష్మీపురం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను వచ్చే నెలాఖరులోగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పరిపాలనా అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించేందుకు అనుసరించాల్సిన విధానాలు, ప్రతిపాదనల ప్రక్రియకు నోడల్ విభాగం ఖరారుపై చర్చించారు. సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ, రెసిడెన్షియల్ పాఠశాలలకు భూములు కేటాయించడంపై సమావేశంలో చర్చించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పురోగతిని పర్య వేక్షించేందుకు ప్రతివారం సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్‌రాజు, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, బి వెంకటేశం, సందీప్ కుమార్ సుల్తానియా, శ్రీధర్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## జమిలి ఎన్నికలపై కేంద్ర కమిటీ- కిషన్ రెడ్డి

**-2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్**
**-నిరంతరం ఎన్నికలతో డెవలప్‌మెంట్‌కు ఆటంకం**
**-సాధారణ నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి**
**-జమిలి ఎన్నికలతో దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు**
**-అన్ని పార్టీలు సహకరిస్తాయనే ఆశతో ఉన్నాం**
**-వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 19 :జమిలి ఎన్నికల నిర్వహణ అమలుకోసం కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేయనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా అయిదేండ్ల పాటు ఏదో ఒకచోట పోలింగ్ జరుగుతున్నందున ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం, తద్వారా విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేక ప్రభుత్వ నిర్ణయాలకు ఆటంకంగా మారాయన్నారు. కొన్నిసార్లు సాధారణ నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి ఏర్పడినట్లు చెప్పారు. ఢిల్లీలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. అసెంబ్లీలు, పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికలకు ఫుల్‌స్టాప్ పెట్టి.. జమిలి ఎన్నికలు జరపాలని నిర్ణయించడం స్వాగతించదగిన పరిణామం అన్నారు.

ఎన్నికల ర్యాలీలు, బహిరంగ సభల కారణంగా.. ట్రాఫిక్ జామ్, ధ్వని కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వేర్వేరుగా ఎన్నికల నిర్వహణ కారణంగా ఖజానాపై ఆర్థికంగా భారం పడుతోందని చెప్పారు. పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించడంతో జరుగుతున్న ఖర్చు ?4,500 కోట్ల పైమాటేనన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణపై కేంద్రమంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై.. దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. ప్రస్తుతం వ్యతిరేకిస్తున్న పార్టీలు త్వరలోనే దీనికి సహకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### 22వ తేదీ డాక్టర్ కత్తి పద్మారావుకి

## "మన కాలపు జాషువా" పురస్కారం ప్రదానం



హైదరాబాద్, సెప్టెంబర్ 19 :ప్రముఖ కవి ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకులు, డాక్టర్ కత్తి పద్మారావుకి ఈ నెల 22వ తేదీ పొన్నూరులోని లుంబినివనంలో "మన కాలపు జాషువా పురస్కార"ం ప్రదానం చేస్తున్నట్లు లోకాయుత పబ్లికేషన్ కో ఆర్డినేటర్ కత్తి చేతన్ తెలియజేసారు. ఈ సందర్భంగా చేతన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ నాయకులకు, కార్యకర్తలకు, లోకాయుత పబ్లికేషన్స్ బాధ్యులకు మరియు అంబేద్కర్ యువజన సంఘాలకు ప్రజా సంఘాలకు నాయకులకు, దళిత బహుజన మహిళ సంఘాలకు, కేడర్‌కు, అభిమానులకు, మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా 22 సెప్టెంబర్ 2024 ఆదివారం ఉదయం గం.10.30 ని.లకు పొన్నూరు లుంబిని వనంకి రావాలని అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్‌లో పగిడిపల్లి వెంకటేశ్వర్లు జాషువా సాహిత్య వేదిక, ఖమ్మం వారు మన మహాకవి డాక్టర్ కత్తి పద్మారావుకి "మన కాలపు జాషువా" పురస్కార ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అందరిని ప్రేమగా ఆహ్వానిస్తున్నామని వేదిక ప్రధాన సదస్సులో మహాకవి గుర్రం జాషువా జీవిత విశేషాలు మరియు తెలుగు సాహిత్యంలో జాషువా విశిష్టత గురించి మహాకవి కత్తి పద్మారావు ఉపన్యాసం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సుకు అందరూ తప్పని సరిగా విచ్చేసి ఉపన్యాసాన్ని విని, మన కాలపు జాషువాగా కత్తి పద్మారావుకి ఇవ్వబోతున్న పురస్కార ప్రధానోత్సవాన్ని ఆద్యంతము తిలకించాల్సిందిగా విన్నవించుకున్నాం. ఈ సందర్భంగా ఏర్పాటు చేయబడిన విందును అందరూ స్వీకరించి వెళ్లవలసిందిగా కోరుతున్నామని లోకాయుత పబ్లికేషన్ కో ఆర్డినేటర్ కత్తి చేతన్ ఎడిటోరియల్ బోర్డు మెంబర్‌లు కనపర్తి అబ్రహం లింకన్, గడ్డం విజయ రావు, శిఖా ఆకాశ్ తెలిపారు.






# ప్రపంచ శాంతి గాలిలో దీపమైందా?!

**(21 సెప్టెంబర్ 'అంతర్జాతీయ శాంతి దినం' సందర్భంగా)**

1981లో ఐరాస సర్వసభ్య సమావేశంలో అహింస, జగడాలు, పోరాటాలు, యుద్ధాలు, హింసాత్మక ఘటనలు, మత విద్వేషాలు, తీవ్రవాద దుశ్చర్యలను కట్టడి చేస్తూనే దయ, కరుణ, సహానుభూతి, శాంతియుత సహజీవనం, కాల్పుల విరమణ, పర్యావరణ పరిరక్షణ, మతసామరస్యాలను నెలకొల్పాలనే సదుద్దేశంతో తీసుకున్న ఏకగ్రీవ తీర్మానం ప్రకారం 'అంతర్జాతీయ శాంతి దినోత్సవం(ఇంటర్నేషనల్ డే ఆఫ్ పీస్)' నిర్వహిస్తున్నారు. 'శాంతి సంస్కృతిని పెంపొందించడం(కల్టివేటింగ్ ది కల్చర్ ఆఫ్ పీస్)' అనే థీమ్‌తో 21 సెప్టెంబర్ 2024న ప్రపంచ దేశాలు 'అంతర్జాతీయ శాంతి దినం' పాటించుట ఆనవాయితీగా మారింది. శాంతి పందిరి కిందనే ఆయురారోగ్య అభివృద్ధి సుసాధ్యమని గుర్తించిన నోబెల్ కమిటీ 1901 నుంచి నోబెల్ శాంతి బహుమతిని ప్రదానం చేయడం చూస్తున్నాం.

## కమ్ముతున్న ప్రత్యక్ష/ప్రచ్ఛన్న యుద్ధ మేఘాలు:

నేడు రష్యా – ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న భీకర యుద్ధంతో పాటు అఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్ల పాలన, ఇజ్రాయిల్ – పాలస్తీనా/లెబనాన్/ఇరాన్ మధ్య యుద్ధ శంఖారావం పూరించడంతో శాంతి పావురాలు రక్తాన్ని చిందిస్తున్నాయి. వీటితో పాటు ఇండియా – చైనా, ఇండో – పాక్, చైనా – థైవాన్ లాంటి పలు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొని, ప్రపంచ శాంతిని వెక్కిరిస్తున్నాయి. అమెరికన్ నాయకత్వాన నాటో దేశాల బలగాల విరమణతో 'తాలిబనిస్థాన్'లో గన్ పాలనకు భీతిల్లిన ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దేశం విడిచి వెళ్ళిపోవడం, నేటికీ అక్కడి ప్రజలు ప్రాణాలను అరచేతుల్లా పెట్టుకొని గజగజ వణుకుతూ బతుకుతున్నారు. మారణహోమాలను సృష్టించనున్న యుద్ధాలను నివారించాలనే నినాదంతో జపాన్‌లో బాలలు ఐరాసకు దానం చేసిన లోహ నాణాలతో తయారు చేసిన గంటను మోగించడంతో ప్రతి ఏట అంతర్జాతీయ శాంతి దినం ప్రారంభమవుతుంది. శాంతియుత సహజీవనమే సుమధురమని, అశాంతి రక్తాన్ని చిందిస్తుందని, హింసతో ప్రాణభయం పెరుగుతుందని, యుద్ధాలతో మారణహోమాలు తథ్యమని గుణపాఠం నేర్చుకోవలసిన సమయమిది. దేశాల మధ్య సరిహద్దు వివాదాలు,ఛాందస మత విద్వేషాలు, ఆయుధాలతో అలజడులు ప్రపంచ శాంతి కపోతానికి గాయపరుస్తున్నాయి.

## విశ్వ శాంతితోనే సమాజాభివృద్ధి:

అంతర్జాతీయ శాంతి దినం రోజున పౌర సమాజం ఒక నిమిషం నిశ్శబ్దాన్ని పాటించడం, ప్రపంచ శాంతి సారాంశంతో సభలు/సమావేశాలు నిర్వహించడం, హింసాత్మక ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజల ఆత్మకు శాంతి కలిగేలా క్యాండిల్స్ వెలిగించడం, సర్వమత శాంతి ప్రార్థనలు, వనమహోత్సవాలు, వన్ భోజనాలు, శాంతి చర్చలు, పీస్ ఆర్ట్ ప్రదర్శనలు, శాంతి ర్యాలీలు/పోస్టర్లు/విద్యాలయాల్లో యువతకు పోటీలు నిర్వహించ వచ్చును. ప్రపంచ శాంతిని కోరుతూ ప్రచ్ఛన్న యుద్ధాలను తగ్గించడం, కాల్పుల విరమణ, యుద్ధ ఖైదీల విడుదల, యుద్ధ వాతావరణాన్ని తొలగించడం, ప్రపంచ దేశాలు తీవ్రవాద సంస్థల్ని మట్టు పెట్టడం లాంటి సవాళ్ళను అధిగమించాలి.

ప్రపంచ శాంతి నెలకొన్నపుడు మాత్రమే సమ న్యాయం, అసమానతల తగ్గింపు, సుస్థిరాభివృద్ధి, ఆరోగ్యం, సర్వ మత సామరస్యాలు సుసాధ్యమని ప్రపంచ మానవాళి గుర్తించాలి. శాంతి కపోతం విశ్వమంతట స్వేచ్ఛగా ఎగిరే సుదినాలు రావడానికి మనందరం చేయూత నిద్దాం. శాంతితోనే సౌభాగ్య జీవితమని ప్రచారం చేద్దాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వెంకటేశ్వర్లు పార్థివదేహానికి నివాళులర్పించిన కోసూరి శ్రీనివాసరావు



ఖమ్మం, సెప్టెంబర్ 19 : (నేటి నిజం ప్రతినిధి): కొనిజర్ల మండల కేంద్రంలో గురువారం అనారోగ్య కారణంగా అకాల మరణం పొందిన కిన్నెర వెంకటేశ్వర్లు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించిన వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాయల పుల్లయ్య, పొట్లపల్లి శేషగిరిరావు, నల్లమోతు లక్ష్మయ్య, కొనకంచి మోసే, చల్లా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 28న మహోత్సవాన్ని ప్రారంభించనున్న భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 :ఈశాన్య ప్రాంత అభివృద్ధి, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల సహకారంతో మొదటి భారతీయ కళా మహోత్సవ్‌ను రాష్ట్రపతి నిలయం నిర్వహించనుంది. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు (సెప్టెంబర్ 29 ? అక్టోబర్ 6) ఈ మహోత్సవం జరుగుతుంది. ఈ నెల 28న రాష్ట్రపతి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

ఎనిమిది రోజుల పాటు సాగే ఈ ఉత్సవాలు ఈశాన్య రాష్ట్రాల సుసంపన్నమైన, వైవిధ్యమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తాయి. ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపురకు చెందిన కళలు, సంస్కృతి, హస్తకళలు, ఆహార వైవిధ్యం గురించి ఈ ఉత్సవం ద్వారా సందర్శకులు తెలుసుకోవచ్చు. ఆయా రాష్ట్రాలకు చెందిన మూడు వందల మందికి పైగా కళాకారులు, హస్తకళా నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 6 వరకు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఎనిమిది గంటల మధ్య ప్రజలు ఈ మహోత్సవాన్ని సందర్శించవచ్చు. ప్రబిబిజూబ:// [illegible] సందర్శకులు రిజర్వ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రవేశం ఉచితం. సందర్శకుల సౌకర్యార్థం సికింద్రాబాద్, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం వద్ద తక్షణ బుకింగ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది.

# పోస్టాఫీసుల నుంచి ఎగుమతి సేవలు అందుబాటులోకి జీఎస్టీ రిఫండ్, చెల్లింపు సర్దుబాట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 :తపాలా శాఖ దేశవ్యాప్తంగా వాణిజ్య ఎగుమతులను ప్రోత్సహించే లక్ష్యంతో డాక్ ఘర్ నిర్యాత్ కేంద్ర (డిఎన్కే) పేరుతో ఒక ఎగుమతుల విభాగాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తన సేవలను గణనీయంగా మెరుగుపరచుకోవాలని సంకల్పించింది. దేశవ్యాప్తంగా ఉన్న 1,000కి పైగా డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాలు ఎగుమతిదారులకు విభిన్న శ్రేణుల్లో సేవలు అందించడానికి సిద్ధం అవుతున్నాయి. ఎగుమతికి సంబంధించిన పోస్టల్ బిల్లు ఇ–ఫైలింగ్, సెల్ఫ్–బుకింగ్, ఎలక్ట్రానిక్ విధానంలో కస్టమ్స్ అనుమతులు, పార్శిల్ చేయడం, ఉచితంగా ఇంటికి వచ్చి తీసుకుపోవడం, రవాణా వస్తువుల వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం, వస్తువుల సంఖ్యను బట్టి తగ్గింపులతో సహా అనేక రకాల సేవలను ఈ కేంద్రాలు అందించనున్నాయి. చేదోడుగా ఉండడం, ఎగుమతిదారులకు మార్గదర్శకంగా ఉండడం ఈ సేవలలో కొన్ని ముఖ్య అంశాలు.

మరొక ప్రధాన పరిణామం, డాక్ ఘర్ నిర్యాత్ కేంద్ర (డీఎన్కే) పోర్టల్ మధ్య ఏకీకరణ ఇప్పుడు ఇండియన్ కస్టమ్స్ ఎలక్ట్రానిక్ గేట్‌వే (ఐస్ గేట్), ఇండియన్ కస్టమ్స్‌ఈడిఐ సిస్టమ్ (ఐసిఈఎస్), పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పిఎఫ్ఎంఎస్), ఎగుమతి డేటా ప్రాసెసింగ్, ఆర్బీఐ నియంత్రణ వ్యవస్థ(ఈడిపిఎంఎస్)తో విజయవంతంగా పూర్తయింది. ఈ ఏకీకరణ ఐజీఎస్టీ రిఫండ్ ను యాంత్రికంగా చేయడానికి డిఎన్కే, కస్టమ్స్, పిఎఫ్ఎంఎస్ వ్యవస్థల మధ్య సమాచార ప్రవాహాన్ని క్రమబద్ధీకరిస్తుంది. ఈడిపిఎంఎస్ లోకి డేటా ప్రవాహం అధీకృత డీలర్లు (ఏడీ బ్యాంకులు) ఎలక్ట్రానిక్ బ్యాంక్ రియలైజేషన్ సర్టిఫికేట్లను (ఈ–బిఆర్సి) జారీ చేయడాన్ని సులభతరం చేస్తుంది. ఎగుమతిదారులు వారి ఎగుమతి లావాదేవీలు, చెల్లింపులపై మెరుగైన పారదర్శకతను పొందుతారు, తద్వారా నిర్ణయాలు తీసుకోవడం సుళువు అవుతుంది.డిఎన్కే పోర్టల్‌ను ఉపయోగించే ఎగుమతిదారులు తప్పనిసరిగా ఐస్గేట్ పోర్టల్‌లో తమ ఏడి కోడ్‌ను నమోదు చేయాలి. సకాలంలో ఐజిఎస్టీ రిఫండులను బ్యాంకుల ఈ–బిఆర్సీ సౌకర్యాన్ని పొందేలా చేయడానికి ఖచ్చితమైన బ్యాంక్ ఖాతా వివరాలను అందించాలి. బ్యాంక్ వివరాలను ధ్రువీకరించడానికి, రీఫండ్ల ప్రత్యక్ష క్రెడిట్‌ను సులభతరం చేయడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా ముఖ్యం.

తపాలా వ్యవస్థ ద్వారా ఎగుమతులను సులభతరం చేయడంలో ఈ ఏకీకరణ ఒక ముఖ్యమైన మలుపుగా చెప్పవచ్చు. ముఖ్యంగా మారుమూల, చిన్న ప్రాంతాల నుండి, భారతీయ ఎగుమతిదారులకు సులభంగాలైన ఓడిఓపి (ఒక జిల్లా, ఒక ఉత్పత్తి)తో ప్రత్యక్షంగా అమలవుతోంది. జిఐ ట్యాగ్ చేసిన ఉత్పత్తులు, మేక్ ఇన్ ఇండియా మొదలైన వాటిని ప్రచారం చేయడం ఎగుమతులను పెంచుతాయి.




# పేజర్‌ల ద్వార అటాక్ కు ఉగ్ర గ్రూపు హిజ్‌బుల్లా యత్నం

**–ప్రతి పేజర్‌లో 3 గ్రాముల పేలుడు పదార్థాలు..**

**– 5వేల పేజర్లకు హిజ్‌బుల్లా ఆర్డర్**

బీరట్ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: లెబనాన్‌లో పేజర్ అటాక్ జరిగిన విషయం తెలిసిందే. సెల్‌ఫోన్లు రాకముందు వాడిన పేజర్లనే లెబనాన్‌కు చెందిన ఉగ్ర గ్రూపు హిజ్‌బుల్లా ఇంకా వాడుతున్నది. ఇటీవల తైవాన్‌లో తయారైన 5 వేల పేజర్లకు ఆర్డర్ ఇచ్చింది హిజ్‌బుల్లా గ్రూపు. అయితే ఆ పేజర్లలోని ప్రతి డివైజ్‌లో సుమారు మూడు గ్రాముల పేలుడు పదార్థాలను వినియోగించినట్లు లెబనీస్ భద్రతా దళాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఇజ్రాయిల్‌కు చెందిన మోసాద్ నిఘా ఏజెన్సీ ఆ పేలుడు పదార్థాన్ని అమర్చినట్లు భావిస్తున్నారు. అత్యంత సీక్రెట్‌గా సాగిన ఆ ఆపరేషన్ వల్ల.. మంగళవారం వేల సంఖ్యలో హిజ్‌బుల్లా వ్యక్తులు గాయపడ్డారు. ఇజ్రాయిల్ చేపట్టిన పేజర్ అటాక్‌కు ప్రతీకారం తీర్చుకోనున్నట్లు హిజ్‌బుల్లా పేర్కొన్నది. కానీ ఇజ్రాయిల్ మిలిటరీ మాత్రం ఇప్పటి వరకు దీనిపై అధికారిక ప్రకటన చేయలేదు. ఎన్నో నెలల క్రితమే పేజర్ అటాక్ ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. పేజర్లనే బీపర్లు కూడా అంటారు. అయితే తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో కంపెనీ నుంచి హిజ్‌బుల్లా 5వేల పేజర్లను ఆర్డర్ చేసింది. కానీ ఆ పేజర్లను యురోపియన్ కంపెనీ తయారు చేసినట్లు గోల్డ్ అపోలో వ్యవస్థాపకుడు హుసూ చింగ్ కువాంగ్ తెలిపారు. ఏపీ924 మోడల్ పేజర్లను హిజ్‌బుల్లా వాడుతోంది. ఆ పేజర్లు.. వైర్‌లెస్ సర్వీస్ చేస్తాయి. టెక్ట్స్ మెసేజ్‌లను కూడా డిస్‌ప్లే చేస్తాయి. కానీ వాటితో టెలిఫోన్ కాల్స్ చేయరాదు. ఇజ్రాయిల్ దళాల నుంచి లొకేషన్ ట్రాకింగ్ జరగకుండా ఉండేందుకు పేజర్లను హిజ్‌బుల్లా ఫైటర్లు వాడుతున్నారు. కానీ ఆ పేజర్లను ఇజ్రాయిల్ నిఘా సంస్థ మోసాద్ .. మార్చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పేజర్లలో పేలుడు పదార్థాలను అమర్చారని, ఏదైనా కోడ్ ఇవ్వగానే అవి పేలుతున్నాయని, దీన్ని డిటెక్ట్ చేయడం కష్టమని, స్కానింగ్ చేసినా గుర్తుపట్టలేమని పేర్కొన్నారు. సుమారు 3వేల పేజర్లు ఒకేసారి పేలి ఉంటాయని భావిస్తున్నారు. కోడ్ మెసేజ్ చేసిన తర్వాత అవి విస్ఫోటనం చెందినట్లు అంచనా వేస్తున్నారు. పేజర్లలో ఉన్న పేలుడు పదార్థాలను హిజ్‌బుల్లా గుర్తించలేకపో యిందన్నారు. లెబనాన్‌లో పేలిన పేజర్లపై గోల్డ్ అపోలో స్టిక్కర్ ఉన్నట్లు గుర్తించారు. ఈ కంపెనీ ఉత్పత్తులు తైవాన్‌లో తయారీ అవుతాయి.

# న్యాయం చేస్తాం... మీకూ భద్రతా కల్పిస్తాం...

**–హోం మంత్రి అనితను కలిసిన ముంబయి నటి కాదంబరి**

**–కుక్కల విద్యాసాగర్ పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి**

**––విజయవాడలో భద్రత కల్పించాలని నటి వినతి**

**నిందితులు ఎంతటివారైనా చట్టపరంగా శిక్షిస్తామని ధైర్యం చెప్పిన హోంమంత్రి**

అమరావతి, సెప్టెంబర్ 19 :ముంబయ్ నటి జెత్వాని కేసులో ఎంతటివారున్నా చట్టపరంగా శిక్షపడేలా చేస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సచివాలయంలోని హోంమంత్రి ఛాంబర్ లో కుటుంబ సభ్యులతో సహా తనను కలవడానికి వచ్చిన ముంబయ్ నటి జెత్వానికి హోంమంత్రి అనిత ధైర్యం చెప్పారు. ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్ అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకున్న విషయాన్ని హోం మంత్రి గుర్తు చేశారు.

అందుకు ముంబయ్ నటి జెత్వాని ప్రభుత్వం, హోం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై కుక్కల విద్యాసాగర్ పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని హోంమంత్రిని నటి జెత్వాని కోరారు. కేసు ముగిసేవరకూ విజయవాడలో ఉన్నప్పుడు తనకు భద్రత కల్పించాలని నటి జెత్వాని హోంమంత్రికి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన హోంమంత్రి భద్రత విషయంలో భయపడాల్సిన అవసరం లేదని లోతైన విచారణ చేసి నిందితులకు శిక్షపడే వరకూ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు సహా అందరూ ఆమెకు అండగా ఉంటామన్నారు.

కొత్త ప్రభుత్వం స్పందించిన తీరు వల్లే ధైర్యంగా తమ బాధను గొంతు విప్పి చెప్పుకోగలిగామని ముంబయ్ నటి జెత్వాని తండ్రి హోంమంత్రితో అన్నారు. కేసు నమోదైన అనంతరం తన వ్యక్తిత్వ హననానికి పాల్పడిన పత్రిక, ఛానల్ ల గురించి ముంబయ్ నటి జెత్వాని హోంమంత్రికి బావోద్వేగంతో వివరించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా ఇంకా స్వేచ్ఛ రాలేదనడానికి నీ పరిస్థితి మరో ఉదాహరణ అంటూ హోంమంత్రి అనిత జెత్వానిని ఓదార్చారు.



# ఎనిమిదో 'ఇండియా వాటర్ వీక్' కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 :ఈ సందర్భంగా రాష్ట్రపతి మాటాడుతూ నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నవారి సంఖ్యను తగ్గించాలనే లక్ష్యం మానవాళికి అవసరమన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ప్రకారం నీరు, పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమంలో స్థానిక సంఘాలను భాగస్వాములను చేసి, వాటి సాయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ప్రతి ఒక్కరికీ నీటిని అందించే ఏర్పాటు చేయడం ప్రాచీన కాలం నుంచి మన దేశ ప్రాధాన్యంగా ఉంది. లదాఖ్ నుంచి కేరళ వరకు నీటి సంరక్షణ, నిర్వహణకు సమర్థమైన వ్యవస్థలు మన దేశంలో ఉండేవి. బ్రిటిష్ పాలనలో ఇవన్నీ క్రమంగా కనుమరుగైపోయాయి. ప్రకృతితో స్నేహం అనే భావన ఆధారంగా మన వ్యవస్థలను నిర్మించారు. ఈ తరహా వ్యవస్థలను తిరిగి అభివృద్ధి చేసేందుకు నేటి ప్రపంచం ఆలోచిస్తోంది. ప్రస్తుత కాలానికి తగినట్లు ఉండే వివిధ రకాల నీటి వనరుల నిర్వహణకు సంబంధించిన అనేక పురాతన ఉదాహరణలు దేశవ్యాప్తంగా నేటికీ దర్శనమిస్తున్నాయి. మన ప్రాచీన నీటి నిర్వహణ వ్యవస్థలను పరిశోధించి ఆధునిక కాలానికి తగినట్లు ఉపయోగించుకోవాలని రాష్ట్రపతి అన్నారు.

బావులు, చెరువులు లాంటి నీటి వనరులు మన సమాజంలో శతాబ్దాలుగా నీటి బ్యాంకులుగా ఉన్నాయని రాష్ట్రపతి తెలిపారు. మనం బ్యాంకులో ముందుగా డబ్బు డిపాజిట్ చేసి, ఆ తర్వాతే విత్ డ్రా చేసుకుని ఉపయోగిస్తాం. ఇదే సూత్రం నీటికీ వర్తిస్తుంది. ముందు ప్రజలు నీటిని నిల్వ చేసి, ఆ తర్వాతే వినియోగించుకోవాలి. డబ్బు వృధా చేసిన వారు ఐశ్వర్యం నుంచి పేదరికంలోకి వెళతారు. అలాగే, ఎక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోనూ నీటి కొరత కనిపిస్తుంది. పరిమిత ఆదాయాన్ని తెలివిగా ఉపయోగించుకునే వ్యక్తులు ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా ఉంటారు. ఈ విధంగా తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో నీటిని నిల్వ చేయడం ద్వారా గ్రామాలు నీటి ఎద్దడి నుంచి సురక్షితంగా ఉంటాయి. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో గ్రామీణులు సమర్థమైన నీటి నిల్వ పద్ధతులు అవలంబించడం ద్వారా నీటి కొరత నుంచి బయటపడ్డారని రాష్ట్రపతి తెలిపారు.

భూమి మీద లభిస్తున్న నీటిలో 2.5 శాతం మాత్రమే తాగడానికి అనువైనదని రాష్ట్రపతి వివరించారు. అందులో కేవలం ఒక శాతమే మానవులు వినియోగించుకునేందుకు అందుబాటులో ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నీటి వనరుల్లో భారత్ వాటా నాలుగు శాతం. మనదేశంలో అందుబాటులో ఉన్న నీటిలో సుమారుగా 80 శాతం వ్యవసాయ రంగంలో వినియోగిస్తున్నాం. సాగుతో పాటు విద్యుదుత్పత్తి, పరిశ్రమలు, గృహావసరాలకు నీటి లభ్యత అవసరం. నీటి వనరులు పరిమితంగా ఉన్నాయి. వాటిని సమర్థంగా వినియోగించడం ద్వారా మాత్రమే అందరికీ నీటి సరఫరా చేయడం సాధ్యమవుతుందని రాష్ట్రపతి అన్నారు.

'క్యాచ్ ద రెయిన్ ? వేర్ ఇట్ ఫాల్స్, వెన్ ఇట్ ఫాల్స్' (వర్షపు నీటిని ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు నిల్వ చేసుకోవడం) అనే సందేశంతో 2021లో ప్రభుత్వం ప్రచారాన్ని ప్రారంభించిందని రాష్ట్రపతి తెలిపారు. నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, ఇతర నీటి నిర్వహణ లక్ష్యాలను సాధించడమే ఈ ప్రచార ముఖ్యోద్దేశం. అటవీ సంపదను వృద్ధి చేయడం కూడా నీటి సంరక్షణకు దోహదపడుతుంది. నీటి సంరక్షణ, నిర్వహణలో చిన్నారులు సైతం కీలక పాత్ర పోషిస్తారు. వారు తమ కుటుంబం, పొరుగువారికి అవగాహన కల్పించి నీటిని సక్రమంగా వినియోగించుకోగలుగుతారు. జలశక్తి చేస్తున్న ప్రయత్నాలు ప్రజా ఉద్యమాలుగా మారాలి. ప్రజలందరూ జల యోధులుగా తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.

సంఘటిత నీటి అభివృద్ధి, నిర్వహణే 'ఇండియా వాటర్ వీక్ –2024' లక్ష్యమని రాష్ట్రపతి తెలిపారు. దానిని సాధించేందుకు భాగస్వామ్యం, సహకారమనే మాధ్యమాన్ని ఎంచుకున్న జలశక్తి మంత్రిత్వ శాఖను ఆమె అభినందించారు.

# ఈ–శ్రామ్ పోర్టల్‌లో నమోదు కావాలనీ, కార్మికుల పేర్లూ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 :ఉద్యోగులుగా కాకుండా, ఒక వెబ్ సైటు ద్వారా స్వతంత్రంగా సేవలు అందించే కార్మికుల (గిగ్ వర్కర్లు) సామాజిక భద్రత కల్పించేందుకు కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. వెబ్ సైట్ల యాజమాన్యాలు (ప్లాట్ ఫాం అగ్రిగేటర్లు) ఈ–శ్రామ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, ఆయా సంస్థలకు అనుబంధంగా పని చేస్తున్న కార్మికుల పేర్లను సైతం నమోదు చేయించాలని ప్రభుత్వం కోరుతున్నది. ఈ కార్మికులు సామాజిక సంక్షేమ పథకాలను అందుకోవడానికి ఈ–శ్రామ్ నమోదు చేసుకోవడం చాలా ముఖ్యం. దీని ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన జాబితాను కచ్చితత్వంతో సేకరించడా నికి వెబ్ సైటు యాజమాన్యాలు సాయపడినట్లు అవుతుంది. ఈ ప్రక్రియలో మార్గనిర్దేశం చేసేలా ప్రామాణిక పని విధానం (ఎన్ఓపీ)తో కూడిన సూచనావళిని మంత్రిత్వ శాఖ జారీ చేసింది. ఇందులో కార్మికులను నమోదు చేయించడం, సమాచారాన్ని ఆధునీకరించడం వంటి బాధ్యతలను యాజ మాన్యాలకు సూచించింది. ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్న తర్వాత కార్మికులకు యూనివర్సల్ అకౌంట్ నెంబర్ (యూఏఎన్) అందుతుంది. కీలకమైన సామాజిక భద్రత ప్రయోజనాలను పొందేందుకు ఇది అవకాశం కల్పిస్తుంది.

ప్రయోగాత్మకంగా కొన్ని వెబ్ సైట్ల యాజమాన్యాలతో కలిసి పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నమోదు ప్రక్రియను కంప్యూటర్ అప్లికేషన్ ద్వారా విజయవంతంగా పరీక్షించింది. ఈ కామార్స్ వెబ్ సైట్ల ద్వారా పని చేస్తున్న కార్మికులందరినీ దీని పరిధిలోకి తీసుకురావడమే వెబ్ సైట్ల యాజమాన్యాలు, మంత్రిత్వ శాఖల ఉమ్మడి ప్రయత్నం.

కార్మికులు ఎంతకాలం పని చేశారు, వారికి చేసిన చెల్లింపులు వంటి వివరాలను ఎప్పటికప్పుడు పొందుపర్చాలని యాజమాన్యాలకు మార్గదర్శకాలను జారీ చేశారు. ఎవరైనా కార్మికులు పని మానేస్తే వెంటనే ఆ సమాచారాన్ని తెలియ జేయాల్సిందిగా కూడా ప్రభుత్వం కోరింది.

కార్మికులు, యాజమాన్యాలు నమోదు ప్రక్రియలో సహకరించేందుకు, సంబంధించిన సమాచారం, మార్గనిర్దేశం అందించేందుకు, నమోదు చేసేటప్పుడు ఏవైనా సాంకేతిక సమస్యలు వస్తే పరిష్కరించేందుకు టోల్–ఫ్రీ హెల్ప్‌లైన్ (14434)ను ఏర్పాటు చేసింది.

# కుల వృత్తులకు ఎంతో ఉపయుక్తం పీఎం విశ్వకర్మ యోజన...



నిర్మల్ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పీఎం విశ్వకర్మ యోజన కుల వృత్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ పథకం కింద తెలంగాణలో మహిళ లబ్దిదారు నిర్మల్ జిల్లా కాల్వ గ్రామానికి చెందిన మా రాజుల లక్ష్మి కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ రాజేశ్వర్ ని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి. సన్మానించారు. ఈనెల 20 తేదీన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ చేతుల మీదుగా లక్ష్మీ చెక్కు ను అందుకోనున్నారు.

# దళితులపై ఇంత కర్కశత్వమా..? ..జూపల్లిపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : దళితులపై చిర్రుబుర్రులాడిన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జటప్రోల్ గ్రామంలోని సమీకృత గురుకుల పాఠశాల భవనం కోసం దళితుల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంచుకుంది. ఈ నేపథ్యంలో అన్యాయంగా మా భూమిని తీసుకోవద్దని న్యాయం చేయండని వచ్చిన దళితులపై ఇంత కర్కశత్వం ప్రదర్శిస్తారా..? అని కేటీఆర్ మండిపడ్డారు. బాధిత దళిత బిడ్డలు మీ భూములు ఇవ్వాలని అడగలేదు.. వారికి గతంలో ఇచ్చిన భూములను తీసుకోకుండా న్యాయం చేయండని మాత్రమే అడిగారు. అంత మాత్రాన నోరు మూయ్ అంటూ సెక్యూరిటీని పెట్టి పంపిస్తారా.. ఇందిరమ్మ రాజ్యంలో దళితులకు న్యాయం చేయరా.. అణిచివేత ఎక్కువైతే తిరుగుబాటు మొదలవుతుందన్న సహజ సూత్రాన్ని మర్చిపోకండి? ఆ దళిత బిడ్డలే మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఘోరి కడుతరు అని జూపల్లి కృష్ణారావును కేటీఆర్ హెచ్చరించారు. మంగళవారం సదరు స్థలాన్ని పరిశీలిచేందుకు మంత్రి జూపల్లి రాగా, సర్వే నంబర్ 508లో ఎనిమిది ఎకరాల భూమిని నాటి జటప్రోల్ సంస్థానాధీశులు రాజా జగన్నాథరావు తమకు ఇచ్చారని దళితులు కిష్టన్న, పెంటయ్య, బాలయ్య, బాలపీరు, సంగమయ్య, శేషమ్మ, శాలయ్య, బాలయ్య తెలిపారు.

# 10 లక్షల మందికిపైగా మహిళల బ్యాంకు ఖాతాలకు నిధుల బదిలీ ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 : మహిళా సాధికారత లక్ష్యంగా ఒడిషా ప్రభుత్వం రూపొందించిన ప్రతిష్ఠాత్మక 'సుభద్ర' పథకానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ భువనేశ్వర్ నగరంలో శ్రీకారం చుట్టారు. ఇది రాష్ట్రంలో విశిష్ట, అత్యంత భారీ మహిళా ప్రాధాన్య పథకం కాగా, దీనికింద కోటి మందికిపైగా మహిళలకు ప్రయోజనం కలుగుతుందని అంచనా. ఇందులో భాగంగా 10 లక్షల మందికిపైగా మహిళల బ్యాంకు ఖాతాలకు నిధుల బదిలీని కూడా ప్రధాని ప్రారంభించారు. అనంతరం రూ.2800 కోట్లకుపైగా విలువైన వివిధ రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన తోపాటు జాతికి అంకితం చేశారు. అలాగే రూ.1000 కోట్లకుపైగా విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. దాదాపు 14 రాష్ట్రాల్లోని 10 లక్షల మంది 'పి ఎంఎవై-గ్రామీణ' లబ్ధిదారులకు 'ఆన్‌లైన్' మార్గంలో తొలి విడత ఆర్థిక సహాయాన్ని విడుదల చేశారు. దేశంలోని 26 లక్షల మంది 'పిఎంఎవై-గ్రామీణ/పట్టణ' లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందించి, వారి గృహప్రవేశ వేడుకలోనూ ఆయన మమేకమయ్యారు. 'పిఎంఎవై-గ్రామీణ' కింద అదనపు గృహవసతి కల్పనపై కుటుంబాల అధ్యయనం కోసం 'ఆవాస్+ 2024' పేరిట రూపొందించిన అనువర్తనాన్ని ప్రారంభించారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన-పట్టణ 2.0 (పిఎంఎవై-యు) అమలుకు మార్గదర్శకాలను కూడా విడుదల చేశారు.

ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ- నేటి కార్యక్రమంలో భాగస్వామినయ్యే అవకాశం ఇచ్చారంటూ ప్రజలకు తొలుత కృతజ్ఞతలు తెలిపారు. పూరీ జగన్నాథునికి, ప్రజలకు సేవచేసే అవకాశం ఆ దేవదేవుని ఆశీర్వాదంతోనే లభిస్తుందని భక్తిపూర్వకంగా ప్రకటించారు. ఇది గణేశ ఉత్సవాల కీలక సమయం కావడంతోపాటు అనంత చతుర్దశి, విశ్వకర్మ పూజ కూడా కలిసివచ్చిన పవిత్ర సందర్భమని ప్రధాని వ్యాఖ్యానించారు. భగవాన్ విశ్వకర్మ రూపంలో నైపుణ్యాన్ని, శ్రమశక్తిని పూజించే ఏకైక దేశం ప్రపంచంలో భారత్ ఒక్కటేనని ప్రధాని అన్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి పవిత్ర పర్వదినాన ఒడిషా తల్లులు, సోదరీమణుల కోసం 'సుభద్ర' పథకాన్ని ప్రారంభించడం తనకు లభించిన మహాదవకాశంగా అభివర్ణించారు.

జగన్నాథ స్వామి వెలసిన ఈ నేలనుంచి దేశంలోని 30 లక్షల కుటుంబాలకు పక్కా గృహాలు స్వాధీనం చేయడాన్ని ప్రధాని ప్రస్తావించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 26 లక్షల మందికి, పట్టణ ప్రాంతాల్లో 4 లక్షల మందికి ఇళ్ల తాళాలు అప్పగించామని ఆయన తెలిపారు. అదే సమయంలో ఇవాళ ఒడిషాలో రూ.వేలాది కోట్లకుపైగా విలువైన అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం నిర్వహించడాన్ని శ్రీ మోదీ గుర్తుచేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రజలతోపాటు దేశ పౌరులందరికీ ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

ఒడిషాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన తాను, నేడు తొలిసారి రాష్ట్ర పర్యటనకు వచ్చానని ఆయన పేర్కొన్నారు. ''రెండు ఇంజన్ల'' ప్రభుత్వం ఏర్పడితే ఒడిషా రాష్ట్రం ప్రగతి-శ్రేయస్సు దిశగా దూసుకెళ్లగలదని ఎన్నికల ప్రచార సభల్లో తాను ప్రకటించడాన్ని ప్రజలకు గుర్తుచేశారు. గ్రామీణులు, అట్టడుగువర్గాలు, దళితులు, ఆదివాసీలు, మహిళలు, యువకులు, మధ్యతరగతి ప్రజానీకంసహా సమాజంలోని అన్ని వర్గాల కలలూ ఇప్పుడు తప్పక నెరవేరగలవని శ్రీ మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తామిచ్చిన వాగ్దానాలు త్వరితగతిన సాకారం అవుతున్నాయంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇప్పటిదాకా నెరవేర్చిన హామీలను ఏకరవు పెడుతూ- ప్రజల సౌకర్యార్థం పూరీలోని శ్రీ జగన్నాథ ఆలయ నాలుగు ద్వారాలనూ తెరిచామన్నారు. అలాగే ఆలయ రత్న భాండాగారాన్ని తెరిపించామని తెలిపారు. రాష్ట్ర ప్రజల సేవకు తమ ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని, సమస్యల పరిష్కారం దిశగా వారి ముంగిటకు వస్తున్నదని హర్షం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చొరవ అభినందనీయమని ప్రశంసించారు.

కేంద్రంలో 'ఎన్‌డిఎ' కొత్త ప్రభుత్వం 100 రోజులు పూర్తిచేసుకున్న ఈ రోజుకు ఒక ప్రత్యేకత ఏర్పడిందని ప్రధాని అన్నారు. తొలి వందరోజుల్లో దేశంలోని పేదలు, రైతులు, యువత, మహిళల సాధికారత దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కొన్ని ప్రధాన నిర్ణయాలను వివరిస్తూ- పేదల కోసం 3 కోట్ల పక్కా ఇళ్ల నిర్మాణం, యువతరానికి రూ.2 లక్షల కోట్ల విలువైన 'ప్రధానమంత్రి ప్యాకేజీ'లను ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్యాకేజీ కింద ప్రైవేటు రంగంలో తొలి ఉద్యోగం పొందినవారికి ప్రభుత్వం మొదటి జీతం చెల్లిస్తుందని చెప్పారు. మరోవైపు వైద్య కళాశాలల్లో అదనంగా 75,000 సీట్లతోపాటు పక్కా రహదారులతో 25,000 గ్రామాల అనుసంధానానికి ఆమోదం తెలిపామన్నారు. అలాగే గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు బడ్జెట్ కేటాయింపు దాదాపు రెట్టింపైందని చెప్పారు. సుమారు 60,000 గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాజెక్టుతోపాటు ప్రభుత్వోద్యోగులకు కొత్త పెన్షన్ పథకం ప్రకటించామన్నారు. వృత్తి నిపుణులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు ఆదాయపు పన్ను తగ్గించామని తెలిపారు.

దేశవ్యాప్తంగా 11 లక్షల మందికిపైగా మహిళలు 'లక్షాధికారి సోదరీమణులు'గా మారడాన్ని గత 100 రోజుల్లో చూశామని ప్రధాని గుర్తుచేశారు. అలాగే నూనెగింజలు, ఉల్లి రైతుల సంక్షేమం దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. మన రైతులను ప్రోత్సహించడంలో భాగంగా విదేశీ నూనెలపై దిగుమతి సుంకాన్ని పెంచామని తెలిపారు. ఎగుమతులకు ప్రోత్సాహం దిశగా బాస్మతి బియ్యంపై సుంకాన్ని తగ్గించామని, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) పెంచామని చెప్పారు. ఈ నిర్ణయాల వల్ల కోట్లాది అన్నదాతలకు రూ.2 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. "మొత్తంమీద గడచిన 100 రోజుల పాలనలో ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కల్పించే అనేక ముఖ్యమైన చర్యలు తీసుకున్నాం" అని ప్రధాని మోదీ ఉద్వేగభరిత వివరణ ఇచ్చారు.

జనాభాలో సగభాగమైన మహిళా శక్తికి సమాన భాగస్వామ్యం ఉంటేనే ఏ దేశమైనా, రాష్ట్రమైనా పురోగమించగలవని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఆ మేరకు మహిళల ప్రగతి, సాధికారతలపైనే ఒడిషా పురోగమనం ఆధారపడి ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంస్కృతిలో భాగమైన ఓ జానపద గాథను ఉటంకిస్తూ- పూరీ జగన్నాథునితో పాటు సుభద్రా దేవి కూడా ఇక్కడ పూజలందుకోవడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఈ నేపథ్యంలో ''సుభద్రా దేవికి ప్రతిరూపాలైన ఇక్కడి తల్లులు, సోదరీమణులు, కుమార్తెలందరికీ నమస్కరిస్తున్నాను" అన్నారు.

రాష్ట్రంలో పాలన పగ్గాలు స్వీకరించిన బీజేపీ కొత్త ప్రభుత్వం తన తొలి నిర్ణయాల్లో భాగంగా ఒడిషాలోని తల్లులు, సోదరీమణులకు 'సుభద్ర యోజన'ను బహూకరించడం హర్షణీయమని ప్రధాని అన్నారు. దీనికింద కోటి మందికి పైగా మహిళలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ పథకం కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.50,000 వంతున నేరుగా జమ అవుతుందని శ్రీ మోదీ చెప్పారు. ఈ పథకాన్ని భారత రిజర్వు బ్యాంకు 'డిజిటల్ కరెన్సీ పైలట్ ప్రాజెక్టు'తో అనుసంధానించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు దేశంలోనే తొలి డిజిటల్ కరెన్సీ పథకంలో భాగమైనందుకు ఒడిషా మహిళలను అభినందించారు.

రాష్ట్రంలోని ప్రతి తల్లి, సోదరి, కుమార్తెకు 'సుభద్ర' పథకం ప్రయోజనం అందేవిధంగా అనేక ప్రచార యాత్రలు నిర్వహించినట్లు ప్రధానమంత్రి చెప్పారు. తద్వారా ఈ పథకం సంబంధిత సమస్త సమాచారంపై వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత కొత్త ప్రభుత్వ ప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంతో ఈ సేవలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం పెంచేదిశగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం సహా ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ కార్యకర్తలు చూపుతున్న చొరవను ప్రధాని అభినందించారు.

ప్రధాని తన ప్రసంగం కొనసాగిస్తూ- "దేశంలో మహిళా సాధికారతకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఒక ప్రతీక" అని వ్యాఖ్యానించారు. ఈ పథకం కింద మంజూరు చేసే గృహాలను కుటుంబంలోని మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 30 లక్షల కుటుంబాలు నేడు గృహప్రవేశం చేశాయని, 15 లక్షల మంది కొత్త లబ్ధిదారులకు ఆమోద పత్రాలు అందజేశామని ఆయన వివరించారు. కొత్త ప్రభుత్వం తొలి 100 రోజుల స్వల్ప వ్యవధిలోనే 10 లక్షల మందికిపైగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నిధులు బదిలీ అయినట్లు గుర్తుచేశారు. "ఈ పవిత్ర కార్యాన్ని ఇవాళ ఒడిషా నుంచి నిర్వర్తించాం. రాష్ట్రంలోని పేద కుటుంబాలు కూడా పెద్ద సంఖ్యలో ఇందులో భాగమయ్యాయి" అని ప్రధాని మోదీ తెలిపారు. పక్కా ఇళ్లు పొందిన లక్షలాది కుటుంబాలకు నేడు కొత్త జీవితం ప్రారంభం అవుతోందన్నారు.

దీనికిముందు రోజున ఓ గిరిజన కుటుంబం గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న తన అనుభవాన్ని ప్రధాని సభికులతో పంచుకున్నారు. ఆ సమయంలో వారి హృదయాల్లో పెల్లుబికిన సంతోషం, వారి ముఖాల్లో పూసిన చిరునవ్వులు, హావభావాల్లో ఎనలేని సంతృప్తిని తాను ఎన్నటికీ మరువలేనని పేర్కొన్నారు. "ఈ అనుభవం.. అనుభూతి నా జీవితాంతం అమూల్య సంపదగా మిగిలిపోతాయి. పేదలు, దళితులు, అణగారిన, గిరిజన వర్గాల జీవితంలో రూపాంతరీకరణే నా ఆనందానికి కారణం... ఇది మరింత కష్టపడి పనిచేసేలా నాకు ఉత్తేజమిస్తుంది" అని ప్రధాని మోదీ ప్రకటించారు.

అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదగడానికి అవసరమైన వనరులన్నీ ఒడిషా సొంతమని శ్రీ మోదీ అన్నారు. యువతరం ప్రతిభ, మహిళా శక్తి, సహజ వనరులు, పరిశ్రమల స్థాపన అవకాశాలు, పర్యాటక రంగ ప్రగతికి పలు మార్గాలు ఉన్నాయన్నారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలోగల బీజేపీ ప్రభుత్వం ఒడిషాకు సదా అగ్ర ప్రాధాన్యం ఇస్తూ వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ కాలంతో పోలిస్తే నేడు కేంద్రం నుంచి మూడు రెట్లు అధిక నిధులు అందుతున్నాయని తెలిపారు. మునుపెన్నడూ వెలుగు చూడని పథకాల ఇప్పుడు అమలులోకి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా- ఆయుష్మాన్ యోజనను ప్రస్తావిస్తూ- ఒడిషా పేదలకు ఇవాళ ఏటా రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స సదుపాయం లభిస్తుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 70 ఏళ్లు దాటిన వృద్ధులకు వార్షికాదాయంతో నిమిత్తం లేకుండా రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందుతుందని వెల్లడించారు. "ఇది లోక్‌సభ ఎన్నికల నాడు మోదీ ఇచ్చిన హామీ... ఇప్పుడు దాన్ని నెరవేర్చారు" అని వ్యాఖ్యానించారు.

పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో ఒడిషాలోని దళితులు, అణగారిన వర్గాలు, గిరిజనులు ప్రధాన లబ్ధిదారులని ప్రధానమంత్రి పేర్కొన్నారు. గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, గిరిజన మూలాలైన అడవులు-భూమిపై హక్కుల పరిరక్షణ, యువతకు విద్య-ఉపాధి అవకాశాల కల్పన, ఒడిషా గిరిజన మహిళను దేశానికి రాష్ట్రపతిని చేయడం వంటివన్నీ ఈ ప్రభుత్వం తొలిసారి చేపట్టినవేనని ప్రధాని ఉద్ఘాటించారు.

ఒడిషాలో అనేక గిరిజన ప్రాంతాలు, సమాజాలు తరతరాలుగా ప్రగతికి దూరమయ్యాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. గిరిజన తెగలలో అత్యంత వెనుకబడిన వారి సముద్ధరణ దిశగా ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి జన్మన్ యోజన' గురించి ఆయన ప్రస్తావించారు. దీనికింద ఇప్పటిదాకా రాష్ట్రంలో 13 వెనుకబడిన తెగలను గుర్తించామని చెప్పారు. ఈ వర్గాలన్నిటికీ ప్రభుత్వం వివిధ అభివృద్ధి పథకాల ప్రయోజనాలను చేరువ చేస్తున్నదని ప్రధాని మోదీ వివరించారు. ముఖ్యంగా కొడవలి కణ రక్తహీనత (సికిల్ సెల్) వ్యాధి నుంచి గిరిజన ప్రాంతాల విముక్తి కార్యక్రమం కడా అమలు చేస్తున్నామని తెలిపారు. దీనికింద గడచిన 3 నెలల్లో 13 లక్షల మందికిపైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

"సంప్రదాయ నైపుణ్యాల పరిరక్షణపై భారత్ నేడు మునుపెన్నడూ లేనిరీతిలో దృష్టి సారిస్తోంది" అని ప్రధాని పేర్కొన్నారు. దేశంలో వందల-వేల ఏళ్లుగా కమ్మరి, కుమ్మరి, స్వర్ణకార, శిల్పకళ వంటి వృత్తుల్లో కొనసాగుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నిరుడు విశ్వకర్మ జయంతి నాడు వారి సంక్షేమం కోసం రూ.13వేల కోట్లతో 'విశ్వకర్మ యోజన'ను ప్రారంభించామని చెప్పారు. ఈ పథకం కింద ఇప్పటిదాకా 20 లక్షల మంది నమోదు చేసుకుని, నైపుణ్య శిక్షణ పొందుతున్నారని తెలిపారు. అటుపైన వారికి ఆధునిక ఉపకరణాల కొనుగోలు కోసం బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రూ.వేలలో హామీరహిత రుణాలు లభిస్తాయన్నారు. పేదలకు ఆరోగ్యంతోపాటు సామాజిక-ఆర్థిక భద్రతలకు హామీ ఇవ్వడం వంటివి వికసిత భారతదేశానికి నిజమైన బలమని శ్రీ మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

అపార ఖనిజ నిక్షేపాలు, సహజ సంపదతో విలసిల్లే సుదీర్ఘ ఒడిషా తీరప్రాంత ప్రాముఖ్యాన్ని ప్రస్తావిస్తూ- రాష్ట్రాన్ని బలోపేతం చేసేదిశగా ఈ వనరులను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. "రాబోయే ఐదేళ్లలో ఒడిషాలోని రహదారులు-రైల్వేల అనుసంధానాన్ని కొత్త శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యత మనమీద ఉంది" అని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ ప్రారంభించిన రైలు-రోడ్డు సంబంధిత ప్రాజెక్టుల గురించి శ్రీ మోదీ వివరించారు. ఈ మేరకు లాంజీగఢ్ రోడ్-అంబోదలా-డోయికలు రైలు మార్గం, లక్ష్మీపూర్ రోడ్-సింగారం-తిక్రీ రైలు మార్గం, ఢెంకణాల్-సదాశివపూర్-హిందోల్ రోడ్ రైలు మార్గాలను జాతికి అంకితం చేసే అవకాశం తనకు దక్కిందని చెప్పారు. అలాగే జైపూర్-నవరంగ్‌పూర్ కొత్త రైలు మార్గానికి శంకుస్థాపన చేశామన్నారు. అలాగే పారాదీప్ రేవునుంచి అనుసంధానం మెరుగు దిశగా నేటినుంచి పని ప్రారంభమైందని తెలిపారు. ఒడిషాలో కొత్త మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు రాష్ట్ర యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయని శ్రీ మోదీ తెలిపారు. పూరీ-కోణార్క్ రైలు మార్గంతోపాటు అత్యాధునిక 'నమో భారత్ ర్యాపిడ్ రైల్' పనులు కూడా త్వరలో మొదలవుతాయిని తెలిపారు. ఈ విధంగా ఆధునిక మౌలిక సదుపాయాలు ఒడిషాకు అపార అవకాశాలను చేరువ చేస్తాయన్నారు.

దేశం ఇవాళ 'హైదరాబాద్ విమోచన దినోత్సవం' నిర్వహించుకుంటున్నదని ప్రధాని పేర్కొన్నారు. ఆనాటి అత్యంత కల్లోల పరిస్థితుల నడుమ భారత వ్యతిరేక ఛాందస శక్తుల నిరోధం ద్వారా హైదరాబాద్ విముక్తిలో సర్దార్ పటేల్ అసాధారణ సంకల్ప బలం ప్రదర్శించారని గుర్తుచేశారు. దేశాన్ని ఏకీకృతం చేయడంలో ఆ మహనీయుడి కృషిని కొనియాడుతూ- ''హైదరాబాద్ విమోచన దినోత్సవమంటే కేవలం ఒక తేదీ కాదు... దేశ సమగ్రతకు, మాతృభూమిపై మన కర్తవ్యానికీ స్ఫూర్తి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

దేశాన్ని వెనక్కి నెట్టే సవాళ్లను ప్రస్తావిస్తూ- స్వాతంత్ర్య పోరాటంలో గణేశ ఉత్సవాల ప్రాముఖ్యాన్ని ప్రధాని వివరించారు. జాతీయ స్ఫూర్తిని రగిలించే ఉపకరణంగా, వలస పాలకుల విభజించి పాలించే వ్యూహాలపై పోరులో ఆయుధంగా లోకమాన్య తిలక్ ఈ వేడుకలను బహిరంగంగా నిర్వహించారని గుర్తుచేశారు. "గణేశ ఉత్సవం ఐక్యతకు ప్రతీకగా, వివక్ష-కులతత్వానికి అతీతంగా మారుతోంది" అన్నారు. ఈ ఉత్సవాల సమయంలో యావత్ సమాజంలో ఐక్యత ఇనుమడిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

కులమతాల ప్రాతిపదికన సమాజాన్ని విచ్ఛిన్నం చేయజూసే శక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు. గణేశ ఉత్సవాల్లో ప్రధాని పాల్గొనడంపై కొన్ని వర్గాలు విద్వేషం వెళ్లగక్కడం, కర్ణాటకలో గణేశ విగ్రహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం వంటివి దురదృష్టకర సంఘటనలుగా ఆయన అభివర్ణించారు. ఇలాంటి విద్వేషపూరిత ధోరణులు, సమాజాన్ని కలుషితం చేసే మనస్తత్వం దేశానికి అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేశారు. ఇటువంటి శక్తులను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు.

చివరగా- ఒడిషాతోపాటు దేశాన్ని విజయవంతంగా సరికొత్త శిఖరాగ్రాలకు చేర్చడంలో అనేక భారీ మైలురాళ్లను అధిగమించగలమని ప్రధాని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. తదనుగుణంగా భవిష్యత్ ప్రగతి పయనంలో వేగం ఇనుమడిస్తుందని హామీ ఇస్తూ ప్రసంగం ముగించారు.

ఈ కార్యక్రమంలో ఒడిషా గవర్నర్ శ్రీ రఘువర్ దాస్, ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాంఝీ తదితరులు పాల్గొన్నారు.

ఒడిషా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సుభద్ర' పథకం కింద 21-60 ఏళ్ల మధ్య వయస్కులైన అర్హతగల లబ్ధిదారులకు 2024-25 నుంచి 2028-29 మధ్య ఐదేళ్లలో రూ.50,000/- అందుతాయి. ఈ మేరకు ఏటా రూ.10,000 వంతున రెండు సమాన వాయిదాల్లో వారి డిబిటి-ఆధారిత బ్యాంకు ఖాతాలకు జమచేస్తారు. ఈ నిధుల పంపిణీలో భాగంగా ప్రధానమంత్రి తొలివిడతగా 10 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాలకు సొమ్ము బదిలీని ప్రారంభించారు.

ప్రధానమంత్రి భువనేశ్వర్‌లో రూ.2800 కోట్లకుపైగా విలువైన వివిధ రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతోపాటు మరికొన్నిటిని జాతికి అంకితం చేశారు. అలాగే రూ.1000 కోట్లకుపైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. వీటిద్వారా ఒడిషాలో రైల్వే మౌలిక సదుపాయాలు, అనుసంధానం మెరుగుపడటమే కాకుండా ప్రాంతీయ వృద్ధికి బాటలు పడతాయి.

ఈ కార్యక్రమాల్లో భాగంగా దాదాపు 14 రాష్ట్రాల పరిధిలోని 'పిఎంఎవై-జి' కింద సుమారు 10 లక్షల మంది లబ్ధిదారులకు తొలివిడత ఆర్థిక సహాయాన్ని ప్రధాని విడుదల చేశారు. అదే సమయంలో దేశవ్యాప్తంగాగల 26 లక్షల మంది 'పిఎంఎవై-గ్రామీణ/పట్టణ' లబ్ధిదారుల గృహప్రవేశ వేడుకలో భాగంగా వారికి ఇళ్ల తాళాలను అందజేశారు. మరోవైపు 'పి ఎంఎవై-జి' కింద అదనపు గృహవసతి కల్పన దిశగా కుటుంబాలపై అధ్యయనం కోసం 'ఆవాస్ + 2024' అనువర్తనాన్ని ప్రారంభించారు. అలాగే 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన-పట్టణ 2.0' అమలుకు మార్గదర్శకాలను విడుదల చేశారు.

# ప్రయాణికులకు గుడ్‌న్యూస్..!

## – టికెట్ బుకింగ్, ట్రాకింగ్ కోసం త్వరలో సూపర్ యాప్

న్యూ డిల్లీ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రైల్వే అన్నిరకాల సేవలు అందించేందుకు సరికొత్త సూపర్ యాప్‌ను కేంద్రం తీసుకువస్తుంది. ఇందులో అన్ని రైల్వే సేవలు అందుబాటులోకి రానున్నాయి. రైలు ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు కేంద్ర కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా సరికొత్తగా సూపర్ యాప్‌ని రూపొందిస్తున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గతంలో ప్రకటించాయి. ఇందులోని అన్ని సేవలు ఈ యాప్‌లో ఉంటాయని చెప్పారురైలులో ప్రయాణానికి తప్పనిసరిగా టికెట్ కావాల్సిందే. టికెట్ల బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీకి ఉపయోగిస్తున్నారు. అయితే, రైల్వే ప్రయాణికులకు కోసం పలు రకాల యాప్స్‌ను ఉపయోగిస్తున్నది.. రైలు టికెట్ బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ యాప్, వెబ్‌సైట్‌ని ఉపయోగిస్తున్నారు. అలాగే, రైలు స్టేటస్‌ని ట్రాక్ చేసేందుకు, పీఎన్ఆర్ స్టేటస్‌ని చూసేందుకు వివిధ రకాల యాప్‌ని ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. అయితే, రైల్వేశాఖకు సంబంధించి టికెట్స్ బుకింగ్, పీఎన్ఆర్ స్టేటస్, ట్రాకింగ్ స్టేటస్ కోసం యాప్స్‌ని ఉపయోగించడం ఇబ్బందికరంగా మారింది.ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం సరికొత్త సూపర్ యాప్‌ని తీసుకురాబోతున్నది. ఇకపై ఈ యాప్‌లోనే టికెట్స్ బుకింగ్, పీఎన్ఆర్ స్టేటస్, ట్రెయిన్ ట్రాకింగ్ చేసేందుకు వీలుంటుంది. అయితే, రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు ఇటీవల రైల్వేశాఖ మంత్రి పేర్కొనారు. గత దశాబ్దల కాలంగా రైల్వేలను అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. అలాగే, సాంకేతికంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇక ప్లాట్‌ఫారమ్ నుంచి జనరల్ టికెట్ వరకు ఆన్‌లైన్ మోడ్‌లో కొనుగోలు చేసే వీలుంటుంది. అదే సమయంలో రైల్వే భద్రతపై ప్రభుత్వం పూర్తిగా దృష్టి సారిస్తోంది. దీంతో రైలు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని మంత్రి చెప్పారు.

# అక్టోబర్ నెలలో 12 రోజులపాటు బ్యాంకులకు సెలవులు

న్యూ డిల్లీ సెప్టెంబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్టోబర్ మాసానికి సంబ ంధించిన సెలవుల జాబితాను విడుదల చేసింది. దాదాపు 12 రోజులపాటు బ్యాంకులు మూతపడనున్నాయి. బ్యాంకుల్లో ఏవైనా పనులు ఉంటే ముందస్తుగా చేసుకోవడం మంచిది. లేకపోతే ఇబ్బందుల పడే ఛాన్స్ ఉంటుంది. అక్టోబర్‌లో గాంధీ జయంతి, బతుకమ్మ పండుగ, దసరా శరన్నవరాత్రులు, కర్వా చౌత్, ధన్‌తేరాస్, దీపావళి పండుగల సందర్భంగా సెలవులు రానున్నాయి. పండుగలు, ప్రత్యేక రోజులు, శనివారాలు.. ఆదివారాల్లో కలిపి 12 రోజులు బ్యాంకులకు సెలవులు పడనున్నాయి. అయితే, రాష్ట్రాల వారీగా సెలవుల్లో మార్పులు ఉంటాయి. ఆయా రాష్ట్రాల్లో పండుగలకు సెలవులు ఉంటాయి. అలాగే, రెండు, నాల్గో శనివారాలతో పాటు ఆదివారాలు దేశవ్యాప్తంగా బ్యాంకులు మూతపడే విషయం తెలిసిందే. అయితే, ఇంతకీ బ్యాంకులకు ఎప్పుడెప్పుడు సెలవులు వచ్చాయో సెలవులు జాబితా...

అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా బ్యాకులకు సెలవు.

అక్టోబర్ 3న నవరాత్రి వేడుకలు ప్రారంభం. మహారాజా అగ్రసేన్ జయంతి సందర్భంగా బ్యాంకులకు సెలవు.

అక్టోబర్ 6న ఆదివారం బ్యాంకుల మూసివేత.

అక్టోబర్ 10 మహా సప్తమి సందర్భంగా బ్యాంకులకు హాలీడే.

అక్టోబర్ 11న మహానవమి సందర్భంగా మూసివేత.

అక్టోబర్ 12న దసరా, రెండో శనివారం సందర్భంగా బ్యాంకుల మూసివేత.

అక్టోబర్ 13న ఆదివారం కావడంతో సెలవు.

అక్టోబర్ 17న కటి బిహు (అసోం), వాల్మీకి జయంతి కారణంగా బ్యాంకులకు హాలీడే.

అక్టోబర్ 20న ఆదివారం సెలవు.

అక్టోబర్ 26న విలీన దినోత్సవం సందర్భంగా జమ్మూ కశ్మీర్‌లో, నాల్గో శనివారం కారణంగా హాలీడే.

అక్టోబర్ 27న ఆదివారం సెలవు.

అక్టోబర్ 31న దీపావళి, సర్దార్ వల్లభాయ్ పటేల్ సందర్భంగా సెలవు.

# కలెక్టర్‌కి చెక్కులు అందజేసిన దయాకర్ రెడ్డి



ఖమ్మం, సెప్టెంబర్ 19 : (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో వరద బాధితుల సహాయర్థం వివిధ వర్గాల వ్యక్తులు విరాళంగా ఇచ్చిన చెక్కులు రూ.2లక్షల 25వేల మొత్తాన్ని గురువారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఖమ్మం కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు అందజేశారు.

# ఆహార భద్రతాధికార సదస్సు 2024 గుర్తు, కరపత్రాలను ఆవిష్కరించిన కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జే పీ నడ్డా

హైదరాబాద్, సెప్టెంబర్ 19 : కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా ఈరోజు నిర్మాణ్ భవన్‌లో ప్రపంచ ఆహార భద్రతాధికార సదస్సు (గ్లోబల్ ఫుడ్ రెగ్యులేటర్స్ సమ్మిట్- జీఎంఆర్ఎస్) 2024 గుర్తును, కరపత్రాలను ఆవిష్కరించారు. ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిర్వహించే వరల్డ్ ఫుడ్ ఇండియా 2024 ఈవెంట్‌తో పాటు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ ఎస్ఏఐ) నిర్వహించే ఈ సదస్సు సెప్టె ంబర్ 19 నుంచి 21 వరకు న్యూఢిల్లీ లోని భారత్ మండపంలో జరగనుం ది.

ప్రపంచ వేదికగా సురక్షిత ఆహార ప్రాముఖ్యతను వివరించిన కేంద్ర ఆరోగ్య మంత్రి, "ఆహార భద్రత చాలాకాలంగా అంతర్జాతీయ ప్రయత్నాలకు కేంద్రంగా ఉన్నప్పటికీ, ప్రపంచ జనాభా ఆరోగ్యం, శ్రేయస్సు కోసం సురక్షిత ఆహారానికి అంతే ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు. ఆహార చక్రంలో- సురక్షిత ఆహార వ్యవస్థలను, నియంత్రణ విధానాలను బలోపేతం చేయడం కోసం, పరస్పర అభిప్రాయాలను పంచుకునేందుకు కోసం ఆహార నియంత్రణ సంస్థల ప్రపంచ స్థాయి వేదిక ఏర్పాటు ఈ సదస్సు ద్వారా సాధ్యమవుతుందన్నారు.

ప్రపంచస్థాయిలో సురక్షిత ఆహారం, నాణ్యత నిర్ధారణ కోసం పరిజ్ఞానాన్ని అందరితో పంచుకోవడం అత్యంత ముఖ్యమని శ్రీ జె పి నడ్డా పేర్కొన్నారు. పెరుగుతున్న ముప్పు, సాంకేతిక పురోగతులను ఎదుర్కోవడానికీ, అలాగే మారుతున్న వినియోగదారుల అవసరాలను తీర్చడానికీ, సురక్షిత ఆహారం, నియంత్రణ వ్యవస్థలో దీనిని నిరంతరం అనుసరించాల్సిన అవసరముందని చెప్పారు.

"ఆహార భద్రతాధికార వ్యవస్థ, ప్రమాద అంచనా సంస్థలు, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు సహా 30 అంతర్జాతీయ సంస్థలు, దాదాపు 5,000 మంది ప్రతినిధులు, 70కి పైగా దేశాల నుంచి ఈ 2వ గ్లోబల్ ఫుడ్ రెగ్యులేటర్ సదస్సులో ప్రత్యక్షంగా పాల్గొంటారు. దాదాపు 1.5 లక్షల మంది వీడియో అనుసంధానం ద్వారా ఈ సదస్సులో పాల్గొననున్నారు. వ్యూహాలు, సహకార మార్గాల గురించి సదస్సులో ప్రధానంగా చర్చిస్తాం. ఆహార భద్రతాధికార వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై కూడా చర్చించనున్నాం'' అని ఆయన తెలిపారు.

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్ఓ), వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీఓ), ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ), కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్, యూరోపియన్ ఫుడ్ సేఫ్టీ అథారిటీ, జాయింట్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఫుడ్ సేఫ్టీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్, యూఎస్ఏ వంటి సంస్థలు దీనిలో పాలుపంచు కుంటాయి. సదస్సులో కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ సెక్రటేరియట్ తరపున దాని చైర్‌పర్సన్, వైస్- చైర్‌పర్సన్, కార్యదర్శి ప్రాతినిధ్యం వహిస్తారు. డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ వీడియో అనుసంధానం ద్వారా సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తారు.

వాణిజ్య శాఖ, ఆహార శుద్ధి మంత్రిత్వ శాఖ (ఎమ్ఓఎఫ్‌పీఐ), వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, వ్యవసాయ సంబం ధ, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ (ఏపీఈడీఏ), సముద్ర సంబంధ ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ (ఎంపీఈడీఏ) అలాగే ఎగుమతుల తనిఖీ మండలి (ఈఐసీ) సహా జాతీయ వాటాదారులు సురక్షిత ఆహార ప్రమాణాల అభివృద్ధిలో భారత్ నిబద్ధతను వివరించడం ద్వారా ఎన్ఏబీసీబీ సదస్సులో క్రియాశీల పాత్ర పోషించనున్నారు.

శ్రీ నడ్డా మాట్లాడుతూ "రోమ్ నగరానికి బయట తొలిసారిగా భారతదేశం ప్రాంతీయ ఫుడ్ రెగ్యులేటర్స్ సదస్సుకు ఆతిథ్యమివ్వడం గర్వించదగ్గ విషయం. కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ పరిధిలో ప్రమాణాలను నిర్దేశించే ప్రక్రియలో ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడంపై సదస్సు ప్రధానంగా దృష్టి సారిస్తుంది. సురక్షిత ఆహారం, వాణిజ్యం అలాగే నియంత్రణ వంటి ఈ ప్రాంత ప్రత్యేక సవాళ్లను చర్చించడానికి ఇది ఆసియా దేశాలకు ఒక ప్రత్యేక వేదికను అందిస్తుంది." అన్నారు.

"సూక్ష్మజీవుల నిరోధకతను (ఏఎమ్ఆర్) తగ్గించడం, ప్రత్యామ్నాయ ఆహారాలు, పోషకాహార మందులు, నియంత్రణ, భద్రతా విధానాల్లో ఆహార సరఫరా, అందరికీ సురక్షిత ఆహారం, పోషకాహారాన్ని అందేలా చేయడం, అవశేష, కలుషితాల పర్యవేక్షణ వ్యవస్థలు, ఆహార పరీక్షల్లో ఆధునిక విశ్లేషణలు, సురక్షిత ఆహారం, ఆరోగ్యంపై పశువుల దాణా ప్రభావం, అలాగే క్రీడలు-పోషణ వంటి కీలకమైన అంశాలపై జీఎఫ్ఆర్ఎస్ 2వ సదస్సు దృష్టి సారిస్తుంది." అని కేంద్ర ఆరోగ్య మంత్రి తెలిపారు. "సురక్షిత ఆహారం అందేలా చర్యలు చేపట్టడం, చట్టాల అమలుపై అవగాహనను పెంచడం, ఉత్తమ పద్ధతులను పంచుకోవడం, అలాగే సురక్షిత ఆహారం అందించడానికి ఇతర దేశాలతో కలిసి పనిచేయడం, ఐక్య వేదికల ఏర్పాటుకు ఈ సదస్సు సహాయపడుతుంది" అని ఆయన తెలిపారు.

పోషకాహారంపై అవగాహన పెంచడానికి చిరుధాన్యాలతో చేసే వంటకాలపై "ఫ్లేవర్స్ ఆఫ్ శ్రీ అన్నా - సెహత్ ఔర్ స్వాద్ కే సంగ్" అనే కార్యక్రమం 13 ధారావాహికలుగా దూరదర్శన్‌లో ప్రసారం కానుంది. దీనిని కూడా ఈ కార్యక్రమంలో భాగంగా ప్రారంభించనున్నారు.

సదస్సు ముఖ్యాంశాలలో- భారత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ పని తీరును అంచనా వేసే స్టేట్ ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్ (ఎస్ఎఫ్ఎస్ఐ) 2024 విడుదల చేయడం, సులభతర వ్యాపార నిర్వహణ గురించి చర్చించడానికి సీనియర్ ప్రభుత్వ అధికారులతో పాటు ప్రధాన ఆహార కంపెనీల ముఖ్య కార్యనిర్వహణాధికారుల సమావేశం, పౌష్టికాహారానికి ప్రాప్యతను మెరుగుపరచడం అలాగే సురక్షిత ఆహారం కోసం మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు భూటాన్, అర్జెంటీనా, న్యూజిలాండ్ అలాగే ఆస్ట్రేలియా దేశాలతో ద్వైపాక్షిక సమావేశాలు ఉన్నాయి.

జీఎఫ్ఆర్ఎస్ 2వ సదస్సులోని అత్యంత ముఖ్యాంశాలలో ఫుడ్ సేఫ్టీ పద్ధతులు అలాగే సమాచారాన్ని పంచుకునే పద్ధతులను మార్చే లక్ష్యంతో అనేక వినూత్న కార్యక్రమాలను ప్రారంభించడం ఒకటి. దీనిలో భాగంగా ప్రత్యేకించి ఆహార దిగుమతుల తిరస్కరణ నివేదికల సమాచారం (ఎఫ్ఐఆర్ఏ) కోసం కొత్త వెబ్‌సైట్ ప్రారంభించడం, ఆహార దిగుమతుల అంగీకార వ్యవస్థ 2.0 (ఎఫ్ఐసిఎస్ 2.0) ఆవిష్కరణ కూడా జరగనుంది. 'ఎఫ్ఐఆర్ఏ' అనేది భారత సరిహద్దుల్లో ఆహార దిగుమతి తిరస్కరణల గురించి సమాచారాన్ని పంచుకోవడానికి రూపొందించిన వెబ్‌సైట్. ఇది సాధారణ ప్రజలకు, అలాగే సంబంధిత దేశంలోని ఆహార భద్రత ప్రాధికార సంస్థల సమాచారం కోసం ఉపయోగపడుతుంది.

వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శకత కోసం, అధునాతన ఫీచర్లు, యాంత్రీకరణ, ఇతర సంబంధిత వెబ్ సైట్ల ఏకీకరణతో పూర్తి పరిష్కారాన్ని అందించడం ద్వారా మునుపటి వ్యవస్థల్లోని పరిమితులను పరిష్కరించే ఆహార దిగుమతుల సమ్మతిని తెలియజేసే అధునాతన వ్యవస్థే- ఈ ఎఫ్ఐసిఎస్ 2.0. భారత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆహార భద్రతా పనితీరును అంచనా వేసే వార్షిక నివేదిక ఆహార భద్రతా సూచిక (ఎస్ఎఫ్ఎస్ఐ) 2024 ను ఈ సదస్సులో విడుదల చేయనున్నారు.

గ్లోబల్ ఫుడ్ రెగ్యులేటర్స్ సదస్సులో అంతర్జాతీయ సంస్థల, శాస్త్రవేత్తల కీలక ప్రసంగాలు, ఫుడ్ రెగ్యులేటర్‌లతో సాంకేతిక, చర్చా కార్యక్రమాలు, జాతీయ, అంతర్జాతీయ వాటాదారులతో పరస్పర సంభాషణలు, అలాగే ప్రస్తుత, పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించడానికి, పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడం, సురక్షిత ఆహారం కోసం సమతుల్య విధానాలను రూపొందించడం కోసం ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలు సహా విభిన్న శ్రేణి కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

శ్రీ అపూర్వ చంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఎఫ్ఎస్ఎస్ఏఐ చైర్‌పర్సన్, శ్రీ జి. కమల వర్ధనరావు, సీఈఓ, ఎఫ్ఎస్ఎస్ఏఐ, శ్రీ నిఖిల్ గజరాజ్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, శ్రీ యూ.ఎస్. ధ్యాని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సహా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు ఈ సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం..

అమరావతి, సెప్టెంబర్ 19 :: సామాన్య భక్తులకు సంతృప్తికర అమ్మవారి దర్శనం కల్పించడంతో పాటు ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయా లని... అందుకు తగిన ఏర్పాట్లను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అధికారులను ఆదేశం చారు.

అక్టోబర్ 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై (బుధవారం) నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి. సృజన, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, శాసనసభ్యుడు వై. సుజనా చౌదరి లు సంబంధిత శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ? ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. భక్తుల మనోభావాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సామాన్య భక్తులకు సైతం సంతృప్తికరమైన దర్శనం కల్పించేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగి పడకుండా ఇప్పటికే దేవస్థానం పటిష్ట చర్యలు తీసుకుందని అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తగా మరింత అప్రమత్తంగా అధికారులు ఉండాలన్నారు. క్యూలైన్‌లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దాతల సహకారంతో త్రాగునీరు, పాలు, అల్పాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూలా నక్షత్రం రోజు అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున గౌరవ ముఖ్యమంత్రి వర్యులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జి. సృజన తెలిపారు.

పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలలో రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాధి మంది అమ్మవారి దర్శనానికి తరలివస్తారన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాకు చెందిన పోలీసులతో పాటు ఇతర జిల్లాల నుండి 3,500 మంది సిబ్బంది సేవలను దసరా ఉత్సవాలలో వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఏర్పాట్ల పరిశీలనకు ప్రతి నిర్ణీత ప్రాంతం, సెక్టార్ (రంగం)కి ఒక ప్రత్యేక అధికారి పరిశీలనలో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. దుర్గా ఘాట్ సమీపంలో గల కమాండ్ కంట్రోల్ ద్వారా దసరా ఉత్సవాల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సమావేశంలో డిసిపిలు గౌతమి శాలి, యం. కృష్ణమూర్తి నాయుడు, అడిషనల్ డిసిపిలు జి. రామకృష్ణ, యం. రాజారావు, డిఆర్‌వో వి. శ్రీనివాసరావు, ఆర్‌డివో భవాని శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, దేవస్థానం ఈఈలు ఎల్. రమ, కోటేశ్వరరావు, వివిధ విభాగాల సూపరింటెండెంట్‌లు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఏపికి రూ.25 కోట్లు విరాళమిచ్చిన అదాని గ్రూప్..

అమరావతి, సెప్టెంబర్ 19 : సెప్టెంబరు మొదటి వారంలో సంభవించిన వరదలు ఏపీలోని పలు ప్రాంతాలను అతలాకుతలం చేశాయి. 40 మందికి పైగా మృత్యువాతపడ్డారు. లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. తీవ్రస్థాయిలో ఆస్తి నష్టం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ కు భారీగా విరాళాలు అందుతున్నాయి. తాజాగా అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. వరద బాధితుల సహాయార్థం రూ.25 కోట్లు అందిస్తున్నట్టు అదానీ ఫౌండేషన్ చైర్ పర్సన్ డాక్టర్ ప్రీతి అదానీ ప్రకటించారు. ఈ క్రమంలో నేడు ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ రూ.25 కోట్ల విరాళం తాలూకు పత్రాలు అందిం చారు. దీనిపై చంద్రబాబు స్పంది స్తూ.. అదానీ ఫౌండేషన్ చైర్ పర్సన్ ప్రీతి అదానీకి, అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీకి కృతజ్ఞతలు తెలియజే శారు. వరద బీభత్సంతో కుదేలైన రాష్ట్ర ప్రజల జీవితాలను మళ్లీ నిలబెట్టడంలో మీ విరాళం ఎంతో ఉప యుక్తంగా ఉంటుంది అంటూ అదానీ గ్రూప్‌ను ఉద్దేశించి చంద్రబాబు ట్వీట్ చేశారు.

# ప్రతి పేద కుటుంబానికి స్వంత ఇల్లు హామీ నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్న మోదీ ప్రభుత్వం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 :ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మూడవసారి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ తొలి 100రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాలు, నిర్ణయాలు అలాగే విజయాలను శ్రీ అమిత్ షా వివరించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 100 రోజులలో సాధించిన ముఖ్యమైన విజయాలను వివరించే 'వికసిత్ భారత్ సాధనను సులభతరం చేసే మార్గం (పేవింగ్ ద పాత్ టు వికసిత్ భారత్)' అనే ప్రత్యేక పుస్తకాన్ని అలాగే ఎనిమిది కరపత్రాలను ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార, రైల్వే, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖా మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ కూడా పాల్గొన్నారు.

మీడియా ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించిన కేంద్ర హోం, సహకార మంత్రి ఈరోజు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన మోదీజీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధాని అయ్యారన్నారు. ప్రపంచంలోని 15 వివిధ దేశాలు ఆయనకు వారి దేశపు అత్యున్నత పురస్కారాలను ప్రదానం చేశాయన్నారు. ఇది వ్యక్తిగతంగా మన ప్రధానమంత్రికి మాత్రమే కాకుండా మొత్తం భారతదేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ రోజు దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు ప్రధాని మోదీ ఆయురారోగ్యాల కోసం భగవంతుడిని ప్రార్థిస్తున్నారని శ్రీ అమిత్ షా అన్నారు.

గడిచిన 10 ఏళ్లలో భారత అభివృద్ధి, భద్రత అలాగే పేదల సంక్షేమానికి అంకితమై సుపరిపాలన అందిచామన్నారు. అందుకే ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు దేశ ప్రజలు తమకు అవకాశం ఇచ్చారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. 60 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఓ నేత వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికై దేశాన్ని నడిపిస్తున్నారని తెలిపారు. 60 ఏళ్లలో తొలిసారిగా దేశంలో మెరుగైన రాజకీయ సుస్థిరత నెలకొందనీ, తన స్వంత విధానాలతో దేశం నిలదొక్కుకుందన్నారు. గడిచిన 10 ఏళ్ల కాలంలో పాలసీల అమలులో వేగం, ఖచ్చితత్వాన్ని కొనసాగిస్తూనే, అంచనాలకు అనుగుణంగా ఫలితాలు సాధిస్తూ 11వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం చాలా కష్టమనీ అలాగే ఇది గొప్ప విజయమనీ ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, గత 10 ఏళ్లలో దేశ బాహ్య, అంతర్గత భద్రత అలాగే రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తూ సురక్షిత భారత్ నిర్మాణంలో ప్రభుత్వం గొప్ప విజయాన్ని సాధించిందని కేంద్ర హోం మంత్రి తెలిపారు. మోదీ నాయకత్వంలో ప్రాచీన, ఆధునిక విద్యావిధానంతో కూడిన నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చారన్నారు. ఇది ప్రాంతీయ భాషలను గౌరవిసుందని ఆయన అభిప్రాయపడ్డారు. నేడు ప్రపంచంలోనే భారత్ అత్యంత ముఖ్యమైన ఉత్పాదక కేంద్రంగా మారిందన్నారు. ప్రపంచంలోని చాలా దేశాలు మన డిజిటల్ ఇండియా పథకాన్ని అర్థం చేసుకుని, ఆమోదించేందుకు అలాగే వారి అభివృద్ధి కోసం ప్రాతిపదికగా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థలోని మొత్తం 13 అంశాలలో క్రమశిక్షణను, పురోగతినీ సాధించినట్లు చెప్పారు. అంతరిక్ష రంగంలో భారత ఉజ్వల భవిష్యత్తును నేడు ప్రపంచమంతా చూస్తోందని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత తొలిసారిగా గడిచిన 10 ఏళ్లలో పటిష్టమైన విదేశాంగ విధానం అమల్లోకి వచ్చిందని హోంమంత్రి చెప్పారు.

గడిచిన 10 ఏళ్ల కాలంలో మోదీ ప్రభుత్వ హయాంలో 60 కోట్ల మంది పేద ప్రజలకు ఇండ్లు, మరుగుదొడ్లు, గ్యాస్ కనెక్షన్లు, త్రాగునీరు, విద్యుత్, నెలకు 5 కిలోల ఆహార ధాన్యం, రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించినట్లు శ్రీ అమిత్ షా తెలిపారు. రాబోయే ఐదేళ్లలో దేశంలో సొంత ఇల్లు లేని కుటుంబం లేకుండా అందరికీ ఇండ్లు అందించే చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మోదీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలను కల్పించిందనీ, నేడు భారత యువత ప్రపంచ యువతతో పోటీ పడేందుకు సిద్ధంగా ఉందని శ్రీ అమిత్ షా తెలిపారు.

రైతుల అభివృద్ధి, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అనేక పథకాలు ప్రవేశపెట్టామని కేంద్ర హోంమంత్రి తెలిపారు. ఈ పథకాల వల్ల దేశంలో ఆహార నిల్వలు నిలకడగా ఉండే స్థాయికి చేరుకోవడమే కాకుండా ఎగుమతులు కూడా చేయగలుగుతున్నామని పేర్కొన్నారు. స్వయం సమృద్ధి సాధించడం ద్వారా రైతులకూ మేలు చేకూరుతుందన్నారు.

మోదీ ప్రభుత్వ మూడవ హాయంలో తొలి 100 రోజులు 'అభివృద్ధి చెందిన భారతదేశం' కోసం బలమైన పునాది పడినట్లు శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఈ 100 రోజుల్లో అన్ని వర్గాల పేదలకు అభివృద్ధి, సంక్షేమం సమంగా అందాయన్నారు. ఈ తక్కువ కాలంలోనే సుమారుగా రూ. 15 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభమైనట్లు చెప్పారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, గడిచిన 10 ఏళ్లుగా స్థిరమైన దిశ, వేగం, ఖచ్చితత్వంతో పాలసీలను అమలు చేస్తున్నామన్నారు. భద్రత, అభివృద్ధి, పేదల సంక్షేమం పట్ల మోదీ ప్రభుత్వం అంకితభావంతో పని చేయడం కొనసాగిస్తుందన్నారు.

ఈ 100 రోజుల కాలాన్ని 14 మూల స్తంభాలుగా విభజించవచ్చని శ్రీ అమిత్ షా తెలిపారు. మౌలిక సదుపాయాల రంగంలో ఈ కాలంలో రూ.3 లక్షల కోట్లతో ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. మహారాష్ట్రలోని వధావన్‌లో ప్రపంచంలోని 10 ప్రధాన నౌకాశ్రయాలలో ఒకటిగా నిలవబోయే మెగా పోర్ట్ రూ.76 వేల కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. రహదారులు లేని 25 వేల గ్రామాలకు రూ. 49 వేల కోట్లతో రహదారుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రూ.50,600 కోట్లతో భారతదేశంలోని ప్రధాన రహదారులను విస్తరించాలని నిర్ణయించామన్నారు. వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు, పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా, బీహార్‌లోని బిహ్తాలో విమానాశ్రయాలను అభివృద్ధి చేయడం అలాగే అగట్టి, మినీకాయ్‌లలో కొత్త ఎయిర్‌స్ట్రిప్‌లను నిర్మించడం ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి కృషి జరుగుతున్నట్లు తెలిపారు. బెంగళూరు మెట్రో 3వ దశ, పూణే మెట్రో, థానే ఇంటిగ్రల్ రింగ్ మెట్రో అలాగే అనేక ఇతర మెట్రో రైలు ప్రాజెక్టులు కూడా ఈ 100 రోజుల్లో ముందడుగు వేశాయని తెలిపారు.

ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 17వ విడత కింద 9.50 కోట్ల మంది రైతులకు రూ.20000ల కోట్లు పంపిణీ చేసినట్లు శ్రీ అమిత్ షా తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 12 కోట్ల 33 లక్షల మంది రైతులకు రూ.3 లక్షల కోట్లు పంపిణీ చేశామన్నారు. ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ) కూడా పెంచామన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే అనేక రెట్లు ఎక్కువ ఎమ్ఎస్‌పీతో పంటలను కొనుగోలు చేసిందనీ, రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

సహకార చక్కెర కర్మాగారాల ఇథనాల్ ఉత్పత్తి యూనిట్లను మొక్కజొన్న నుండి ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడం కోసం బహుళ-ఫీడ్ ఇథనాల్ యూనిట్‌లుగా మార్చామన్నారు. దీంతో ఇప్పుడు చెరకు నుంచే కాకుండా మొక్కజొన్న నుంచి కూడా ఇథనాల్‌ను ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. ఉల్లిపాయలు, బాస్మతి బియ్యంపై కనీస ఎగుమతి ధర (ఎమ్ఈపీ)ని తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. ఉల్లిపై ఎగుమతి సుంకం 40శాతం నుంచి 20శాతానికి తగ్గిందని తెలిపారు.

ఈ 100 రోజుల్లో మధ్యతరగతి ప్రజలకు ఎన్నో ఉపశమనాలు కల్పించామని కేంద్ర హోంమంత్రి తెలిపారు. పన్ను మినహాయింపు కింద, రూ. 7 లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి ఆదాయపు పన్ను ఉండదన్నారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ (ఓఆర్ఓపీ) మూడవ వెర్షన్ అమలు చేశామన్నారు. అలాగే ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద 3 కోట్ల ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద కోటి ఇండ్లు, రూరల్ హౌసింగ్ స్కీమ్ కింద 2 కోట్ల ఇండ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

ఈ ఏడాది ఇప్పటివరకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద 2.5 లక్షల కుటుంబాలకు సౌరశక్తి చేరింది. ఈ ప్రత్యేక పథకం మధ్యతరగతి కుటుంబాల కరెంటు బిల్లు తగ్గించడమే కాకుండా సౌరశక్తి వినియోగ లక్ష్యం నెరవేరేందుకు దోహదపడుతుంది. పర్యావరణ అనుకూల వ్యవస్థను రూపొందించడానికి సుమారు రూ. 3400 కోట్ల సహాయంతో మా ప్రభుత్వం పీఎమ్ ఈ-బస్ సేవలకు ఆమోదం తెలిపింది. అంకుర సంస్థలకు ఆర్థిక ఉపశమనం కల్పించేందుకు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అంకుర సంస్థలపై పెనుభారంగా ఉన్న 31శాతం ఏంజెల్ ట్యాక్స్ రద్దు చేసినట్లు శ్రీ అమిత్ షా తెలిపారు.

జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద, 12 పారిశ్రామిక జోన్‌లను ప్రధాన జాతీయ రహదారులకు అనుసంధానం చేయనున్నామని తెలిపారు.

మధ్యతరగతి ప్రజల కోసం అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ముద్ర రుణాల పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచడంతో పాటు, తమ పాత రుణాలను తిరిగి చెల్లించిన వారందరూ దీని ద్వారా ప్రయోజనం పొందుతారని తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ఈల కోసం క్రెడిట్ గ్యారెంటీ పథకం ప్రారంభించబడిందనీ, దీని కింద చిన్న వ్యాపారులు, చిన్న పారిశ్రామికవేత్తలు హామీ లేకుండా రుణాలు పొందవచ్చని పేర్కొన్నారు.

ఏ దేశ అభివృద్ధి కోసమైనా యువత సాధికారత ప్రాథమిక అవసరం అని కేంద్ర హోం, సహకార మంత్రి అన్నారు. తమ ప్రభుత్వం రూ. 2 లక్షల కోట్ల ప్రధానమంత్రి ప్యాకేజీని ప్రకటించిందనీ, దీని ద్వారా రాబోయే ఐదేళ్లలో 4 కోట్ల 10 లక్షల మంది యువత లబ్ధి పొందనున్నారని తెలిపారు. అగ్రశ్రేణి కంపెనీలలో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు, అలవెన్సులు అలాగే వన్-టైమ్ సహాయం కూడా అందించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో వేలాది నియామకాల కోసం ప్రకటనలు జారీ చేశామన్నారు.

మూలధన వ్యయాన్ని 11 లక్షల 11 వేల కోట్ల రూపాయలకు పెంచడం ఒక గొప్ప విజయంగా శ్రీ అమిత్ షా అభివర్ణించారు. ఇది చాలా మంది యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందనీ అలాగే మన మౌలిక సదుపాయాలు కూడా బలోపేతం అవుతాయన్నారు. పీఎల్ఐ పథకం అలాగే 12 పారిశ్రామిక జోన్‌ల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఇలకు ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాలు యువత కోసం కూడా ప్రయోజనకరం అవుతాయి అని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

దీనదయాళ్ అంత్యోదయ యోజన కింద 10 కోట్ల మంది మహిళలను సంఘటితం చేసి 90 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేశామని అమిత్ షా తెలిపారు. అలాగే లఖ్‌పతి దీదీ యోజన కింద, 100 రోజుల్లో 11 లక్షల మంది కొత్త లఖ్‌పతి దీదీలకు సర్టిఫికెట్లు అందించామన్నారు. కోటి మందికి పైగా లఖ్‌పతి దీదీలు ఏటా లక్ష రూపాయలు సంపాదిస్తున్నారని తెలిపారు. ఏడాదికి లక్ష ఆదాయం సంపాదించడం కలగా భావించిన ఈ మహిళలు నేడు ఆ కలను సాకారం చేసుకుని గౌరవంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు.

పర్యాటన్ మిత్ర, డ్రోన్ దీదీ ద్వారా మార్గదర్శకంగా పని చేసేందుకు పర్యాటన్ దీదీని స్వయం సహాయక బృందాలకు అనుసంధానం చేశామని శ్రీ అమిత్ షా తెలిపారు. దీంతో పాటు యువతను పర్యాటకంతో అనుసంధానం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ప్రధాన్ మంత్రి జనజాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ కింద 63 వేల గిరిజన గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని కేంద్ర హోంమంత్రి తెలిపారు. దీని ద్వారా 5 కోట్ల మంది గిరిజనుల ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందన్నారు.

ఈ పథకం కింద, ఆయా గ్రామాల్లో ప్రాథమిక అవసరాలన్నీ తీర్చుతూ, కనీస వసతులను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ 100 రోజుల్లో షెడ్యూల్డ్ కులాల దివ్యాంగులకు 3 లక్షల కొత్త గుర్తింపు కార్డులు అందించామని తెలిపారు.

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎమ్ఆర్ఎస్)ని నూతన విధానంలో తిరిగి ప్రవేశపెడుతున్నట్లు హోంమంత్రి తెలిపారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, రక్షణ, దుర్వినియోగ నివారణకు వక్ఫ్ సవరణ బిల్లు-2024 కట్టుబడి ఉందని, రానున్న రోజుల్లో దీనిని పార్లమెంట్‌లో ప్రవేశపెడతామని అమిత్ షా చెప్పారు. ఆయుష్మాన్ భారత్ యోజన ప్రధానమంత్రికి చాలా ఇష్టమైన కార్యక్రమమని, ఈ పథకం కోట్లాది ప్రజల జీవితాలను సులభతరం చేసిందని శ్రీ అమిత్ షా అన్నారు. దీని కింద రూ.5 లక్షల వరకు చికిత్స ఖర్చును నరేంద్ర మోదీ ప్రభుత్వం భరిస్తోంది. మా పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తామన్నారు. 70 ఏళ్లు పైబడిన వారికి స్వంత కార్డుతో పాటు రూ.5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుందనీ, దీంతో వారి కవరేజీ రూ.10 లక్షలకు పెరుగుతుందని తెలిపారు. దాదాపు 4.5 కోట్ల కుటుంబాలకు చెందిన 6 కోట్ల మంది వృద్ధులు దీని ద్వారా లబ్ధి పొందుతారని, దీనికి ఎలాంటి ఆదాయ పరిమితి లేదని హోంమంత్రి తెలిపారు.

కొత్తగా 75,000ల మెడికల్ సీట్లను చేర్చడం ద్వారా వైద్య విద్య కోసం విదేశాలపై ఆధారపడే పరిస్థితికి స్వస్తి చెప్పే దిశగా అడుగులు వేస్తున్నామని కేంద్ర హోంమంత్రి తెలిపారు. దీనికోసం 3 ఏళ్ల లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఆగస్టు 23న మొదటి అంతరిక్ష దినోత్సవాన్ని జరుపు కున్నామనీ, దీని కింద యువతను అంతరిక్ష రంగంలో ప్రోత్సహించేందుకు, వారిలో ఆసక్తి పెంపొందించేందుకు అనేక పథకాలు ప్రారంభించామని శ్రీ అమిత్ షా తెలిపారు. విపత్తు నిర్వహణ కోసం జాతీయ డేటాబేస్ అలాగే గ్రామీణ భూ రికార్డుల కోసం పంచాయతీ పోర్టల్ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. గుజరాత్‌లోని సనంద్‌లో సెమికండక్టర్ యూనిట్ ఏర్పాటు చేయబడిందన్నారు. రాబోయే 10 ఏళ్లలో, సెమికండక్టర్ల రంగంలో భారతదేశం ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు.

బ్రిటీష్ వారు రూపొందించిన 150 ఏళ్ల నాటి నేర చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) అలాగే భారతీయ సాక్ష్య అధినీయం (బీఎస్ఏ) అనే మూడు కొత్త చట్టాలు జూలై 1నుండి అమలులోకి వచ్చినట్లు హోం మంత్రి తెలిపారు. ఈ మూడు కొత్త చట్టాలు రాబోయే రోజుల్లో న్యాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా, న్యాయం పొందుటను సులభతరం చేస్తాయన్నారు. అలాగే సకాలంలో న్యాయాన్ని అందించడం వీలుపడుతుందని తెలిపారు. రాబోయే 3 ఏళ్లలో ఈ చట్టాల పూర్తి స్థాయిలో అమలుతో, భారత క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత ఆధునికమైనది అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

జూన్ 25వ తేదీని సంవిధాన్ హత్యా దివస్‌గా జరుపుకోవాలని నిర్ణయించడం ద్వారా దేశంలో మళ్లీ ఎమర్జెన్సీ చీకటి కాలం రాకుండా రాబోయే తరాలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశామని శ్రీ అమిత్ షా అన్నారు. ప్రధాని మోదీ రష్యా, ఉక్రెయిన్‌ల కీలక పర్యటనల గురించి ఈరోజు ప్రపంచం అంతా ఆశగా ఎదురుచూస్తోందన్నారు.

మొదటిసారిగా, యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కమిటీ తన కీలక సమావేశం భారత్‌లో నిర్వహించిందనీ, ఇది రాబోయే రోజుల్లో మన దేశంలోని అనేక వారసత్వ ప్రదేశాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. 35 ఏళ్ల సుదీర్ఘ వివాదం తర్వాత ఈ ఏడాది సెప్టెంబర్ 4న త్రిపురలో ఎన్ఎల్ఎఫ్‌టి, ఎటిటిఎఫ్‌లతో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నట్లు కేంద్ర హోంమంత్రి తెలిపారు. దేశంలోనే తొలిసారిగా పట్టణప్రాంతాల్లో వరదల నిర్వహణ కోసం రూ.6350 కోట్లతో కొత్త పథకాన్ని తెచ్చామన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి పోస్టర్ ను ఆవిష్కరించిన మందకృష్ణ మాదిగ




9హైదరాబాద్ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్); ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమ పోస్టర్ ను ఆవిష్కరించిన ఎంఆర్పిఎస్ అధినాయకులు, బాపూజీకి ఆత్మీయులు మంద కృష్ణ మాదిగ బుదవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రము ఆయనకు రుణపడి ఉంటుందన్నారు.. బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో జలదృశ్యంలో జరుగనున్న వర్ధంతి సభకు తెలంగాణ వాదులు, ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు ..

# ఇస్రో పంపిన ప్రతిపాదలకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర

### చంద్రయాన్-4 మిషన్, గగన్‌యాన్, వీనస్ ఆర్బిటర్ మిషన్, ఎన్‌జీఎల్‌వీ వాహకనౌక ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

న్యూ డిల్లీ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఇస్రో పంపిన ప్రతిపాదలకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. చంద్రయాన్-4 మిషన్, గగన్‌యాన్, వీనస్ ఆర్బిటర్ మిషన్, ఎన్‌జీఎల్‌వీ వాహకనౌక ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులకు నిధులు సైతం కేటాయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. కేబినెట్ చంద్రయాన్-4 మిషన్‌కు ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ ప్రాజెక్టులు చంద్రుడి నుంచి రాళ్లు, మట్టిని భూమిపైకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఇస్రో 2026 నాటికి చేపట్టాలని భావిస్తున్నది. రెండు దశల్లో చంద్రయాన్-4 మిషన్‌ను నిర్వహిస్తుంది.రెండుదశల్లో భాగాలను నింగిలోకి పంపి.. ఆ తర్వాత స్పేస్‌లోనే కనెక్ట్ చేయనున్నారు. ల్యాండర్‌ను ఇస్రో నిర్మిస్తుండగా.. రోవర్‌ను జపాన్‌లో సిద్ధం చేస్తున్నారు. మిషన్‌లో భాగంగా చంద్రుడిపై మట్టి నమూనాలను సేకరించి.. తిరిగి భూమిపైకి చేరుకుంటుంది. ప్రాజెక్టు విజయవంతమైతే అంతరిక్షంలోనే స్పేస్ షటిల్‌ను రూపొందించిన దేశంగా భారత్ చరిత్ర లిఖించనున్నది. ఇక భారత్ గగన్ యాన్ ప్రాజెక్టును సైతం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నది. ఇందులో భాగంగా వ్యోమగాములను నింగిలోకి పంపేందుకు ప్లాన్ చేస్తున్నది. ఇందుకోసం వ్యోమగాములను సైతం ఎంపిక చేసిన శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. దాంతో పాటు వీనస్ ఆర్బిటర్ మిషన్‌కు సైతం కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులో భూమికి దగ్గరలో ఉన్న వీనస్‌పై అధ్యయనం చేయనున్నది. ఇందులో వీనస్ వాతావరణంపై పరిశోధనలు జరుపనున్నది. అలాగే, తర్వాతి తరం లాంచ్ వెహికల్‌కు సైతం కేబినెట్ ఆమోదం తెలిపింది. తక్కువ భూకక్ష్యలో 30 టన్నుల పేలోడ్‌ను ప్రవేశపెట్టడం దీని లక్ష్యం.

# ప్రజాస్వామ్యంలో ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం సాధ్యం కాదు

### -కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే

న్యూ డిల్లీ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జమిలి ఎన్నికలకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. జమిలి ఎన్నికలపై కోవింద్ కమిటీ సమర్పించిన నివేదికకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. ఒకే దేశం ఒకే ఎన్నికపై కోవింద్ కమిటీ సిఫార్సులకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో ఖర్గే మాట్లాడుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయంతో తాము విభేదిస్తున్నామని, ప్రజాస్వామ్యంలో ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం పనిచేయదని స్పష్టం చేశారు. మన ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే అవసరమైనప్పుడు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఖర్గే పేర్కొన్నారు. కాగా, వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రక్రియకు ఇవాళ కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ అందజేసిన రిపోర్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.ఎట్టి పరిస్థితుల్లోనైనా జమిలి ఎన్నికలు నిర్వహించి తీరుతామని ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్న విషయం తెలిసిందే.రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రతిపాదన చేసింది. సెప్టెంబర్‌లో ఆ ప్యానెల్ ఏర్పాటైంది. లోక్‌సభ ఎన్నికలకు ముందే కోవింద్ ప్యానెల్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. న్యాయశాఖ ఆ రిపోర్టును ఇవాళ కేంద్ర క్యాబినెట్ ముందు ప్రవేశపెట్టింది. వంద రోజుల మోదీ సర్కార్ పాలన సందర్భంగా ఈ రిపోర్టును ముందుకు తీసుకువచ్చారు.

# అభివృద్ధి, సంక్షేమమే మూడు పార్టీల లక్ష్యం : చంద్ర బాబు



అమరావతి, సెప్టెంబర్ 19 :మంగళగిరిలోని సి-కన్వెన్షన్ సెంటర్‌లో ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ మాట్లాడుతుంటే గతం గుర్తొస్తోంది. ఆ రోజుల్లో భయంకరమైన పరిస్థితులుండేవి.. పవన్ ఏపీకి రావాలంటే ఫ్లైట్ క్యాన్సిల్ చేశారు. ఫ్లైట్ క్యాన్సిల్ చేస్తే.. రోడ్డు మార్గంలో వచ్చారు. రోడ్ మార్గంలో కూడా పవన్ కళ్యాణ్ ను రానివ్వలేదు. కానీ పవన్ కళ్యాణ్ రోడ్ మీదే పడుకున్నారు. సాధారణంగా సినిమావాళ్లు ఇదంతా చేయరు.. కానీ పవన్ పట్టుదలతో ప్రజాస్వామ్యం కోసం కష్టపడి పని చేశారు. జైల్లో ఉన్న నన్ను పరామర్శించారు. కష్టకాలంలో ఉన్నప్పుడు ఏ మాత్రం ఆలోచించకుండా పొత్తు గురించి ప్రకటన చేసిన వ్యక్తి పవన్ కళ్యాణ్.

బీజేపీతో పొత్తులో ఉన్నా.. టీడీపీతో పొత్తు ఉంటుందని ప్రకటించారు. బీజేపీని కూడా ఒప్పిస్తానని చెప్పారు పవన్ కళ్యాణ్. నాది, పవనుది ఒకే ఆలోచన. ప్రజలు గెలవాలి.. రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేయాలనేదే మా ఇద్దరి ఆలోచన అని స్పష్టం చేశారు. సీట్ల విషయంలో కూడా ఏ చిన్న గ్యాప్ లేకుండా పని చేశాం.

పురందేశ్వరి కూడా పొత్తు గురించి కృషి చేశారు. వేరే వారు బీజేపీ అధ్యక్షునిగా ఉంటే ఏమయ్యేదో తెలీదు కానీ.. పురందేశ్వరి ఉన్నారు కాబట్టి పొత్తు సాధ్యమైందని పేర్కొన్నారు. మూడు పార్టీలు.. మూడు రకాల స్వభావాలు.. కానీ, ఒకటే ఆలోచన.. ముగ్గురు కలిసి పోటీ చేస్తే రాష్ట్రానికి పునర్ వైభవం తేవచ్చని భావించాం. ఈ మూడు పార్టీల కలయిక శాశ్వతంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు. పొత్తు వల్ల నష్టం వస్తుందేమోననే అనుమానాల్ని కొందరు వ్యక్తం చేశారు.. కాదు లాభమని మేం ఇద్దరం నమ్మాం.. అదే నిజమైంది అని చంద్రబాబు అన్నారు.

# పల్లపుశ్రీను పెద్దకర్మకు హాజరైన కాంగ్రెస్ నేతలు

- కోసూరి శ్రీనివాసరావు



ఖమ్మం, సెప్టెంబర్ 19 : (నేటినిజం ప్రతినిధి): వైరా మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల అనారోగ్య కారణంగా అకాల మరణం పొందిన పల్లపు శ్రీను పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాయల పుల్లయ్య, పొట్లపల్లి శేషగిరిరావు, నల్లమోతు లక్ష్మయ్య, కొనకంచి మోసే, చల్లా భాస్కర్, చల్లా రామారావు, చల్లా జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడమే మోడీ లక్ష్యం

### - దేశ అభివృద్ధి కొరకే జమిలి ఎన్నికలు
### - బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశంలో అన్ని సామాజికవర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడమే లక్ష్యంగా మోడీ వంద రోజుల పాలన పూర్తి చేసుకున్నదని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.బుదవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ కార్మిక, కర్షక, శ్రామికుల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ వెళ్తోందని,.మహిళల సాధికారత కోసం మోదీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు..75 ఏళ్ల పైబడిన ఆరు కోట్ల మందికి హెల్త్ కార్డులు ప్రొవైడ్ చేశారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ఈకో సిస్టాన్ని అభివృద్ధి చేస్తున్నారు. మ్యాన్ ఫ్యాక్చర్ హబ్ గా ఇండియా వేగంగా దేశం అభివృద్ధి చెందుతోంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక దేశంగా భారత్ నిలబడబోతోందంటే అది ప్రధాన మంత్రో నరేంద్ర మోడీ కృషి పట్టుదల అన్నారు

9.జమిలీ ఎన్నికల పై స్పందిస్తు దేశ అభివృద్ధి కొరకే జమిలి ఎన్నికలు. జమిలి తో సమయం డబ్బు రెండు అదా అవుతాయి. దేశంలో నిత్యం ఏదో ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో దేశ అభివృద్ధికి కొంత ఆటంకం ఏర్పడుతుంది. దేశ అభ్యున్నతి కోసం తీసుకున్న నిర్ణయాలు కొంత మందికి నచ్చవు. జమిలీ ఎన్నికలకు కొంత సమయం పడుతుంది. అందుకే ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల కు ఎన్నికలు. పార్లమెంట్ లో జమిలి బిల్లు ప్రవేశ పెడతారు. అప్పుడు అందరికీ మాట్లాడే అవకాశం వస్తది. ప్రతిపక్షాలకు ఏదైనా అభ్యంతరం ఉంటే చర్చలో చెప్పొచ్చు. నన్నారు.



